Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)



స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 83 • సంచిక: 44 • 1-11-2013 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



● సిఎం, ఆర్థికమంత్రి కలసి ఖజానా దోపిడీకి రచించిన పథకమే...

కండ్లేరు నుంచి చిత్తూరుకు నీటి తరలింపు!

కండ్లేరు రిజర్వాయర్ నుంచి నీటి చోరీ జరగబోతున్నదని రెండు నెలల క్రితమే హెచ్చరిక చేసింది 'జమీన్‌రైతు' పత్రిక. కానీ అటు జిల్లా రైతాంగం, ఇటు రాజకీయవాదులు అప్రమత్తం కాలేక పోయారు. ఫలితం – ఆ చోరీ ఖాయమైపోవడం. కండ్లేరు నుంచి నీటి తరలింపుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. చిన్నా చితక పనులు కాదు. దాదాపు 5990 కోట్ల రూపాయల విలువైన పనులివి. ఒకటిన్నర సంవత్సరం లోపల కండ్లేరు నుంచి మదనపల్లి, పీలేరుల వరకు పైప్ లైన్ నిర్మాణం పూర్తి చేయాలన్నది పథకం.దాని ద్వారా ఆరున్నర టిఎంసిల నీరు తరలించబోతున్నారు. ఆరున్నర టిఎంసిలు అంటే, కనీసం లక్ష ఎకరాల మెట్ట పొలాలకు సాగన్నమాట.

నెల్లూరుజిల్లా రాజకీయవాదులు, రైతులు చేవ చచ్చిన చచ్చు దద్దమ్మలు కాబట్టి ఈ నీటి దోపిడీ ఇంత సునాయాసంగా జరిగిపోతున్నది. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి తన నియోజక వర్గంలో నీటి కరువు లేకుండా చేయాలన్నది ఒక కల. అందుకోసం గాలేరు నగరి, హంద్రీ నీవా వంటి పథకాల నిర్మాణాన్ని శరవేగంగా జరిపిస్తున్నాడు. అయినా ఆయన దురాశ తీరలేదు. కండ్లేరుకు కన్నం పెడుతున్నాడు. సాగునీరు అంటే, ఎన్నో చట్టాలు, ఆంక్షలు, రైపేరియన్ రైట్స్, కోర్టు కేసులు వంటివి అడ్డం వస్తాయి కాబట్టి, ఈ నీళ్ల దొంగతనానికి చిత్తూరుజిల్లా మంచినీటి సరఫరా పథకం అని పేరు పెట్టాడు.

ఇంత బరితెగింపుగా, ఇంత దౌర్జన్యంగా నీటి తరలింపు ఒక నెల్లూరు జిల్లా నుంచి తప్ప మరెక్కడా

కొరవ 14వ పేజీలో

చందాదారులకు మనవి

న్యూస్‌ప్రింట్, రవాణా, సంచిక తయారీ ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిన దృష్ట్యా 'జమీన్‌రైతు' సంవత్సర చందాను నవంబర్ 1తేది నుంచి 250 రూపాయలు చేస్తున్నాము. జీవిత చందాను 2000 రూపాయలుగా పెంచుతున్నాము. కాని విడిప్రతి మాత్రం ఎప్పటి మాదిరిగానే ఐదు రూపాయలుగానే వుంటుంది. చందాదారులు పెద్ద హృదయంతో అర్థం చేసుకొని ఎప్పటి మాదిరిగానే 'జమీన్ రైతు'కు సహకార మందించగలరు.

- సంపాదకుడు



పంట బీమా ఇంతేనా?

ఇ తర పారిశ్రామికాభివృద్ధి తర్వాత కూడా దేశంలో నూటికి 60 మందికి పైగా బ్రతుకు తెరువు కోసం వ్యవసాయం మీదనే ఆధారపడుతున్నారు. 70 శాతం మంది గ్రామాలలోనే నివసిస్తున్నారు. 2011 జనాభా లెక్కలు ఆ నిజాన్ని మరొకసారి నిర్ధారించాయి. అయితే ఆ వ్యవసాయ రంగంలో కనీసపాటి భద్రత, రక్షణ చర్యలు చేపట్టడంలో మాత్రం ప్రభుత్వాలు విఫల మౌతూనే వున్నాయి. రైతుల ఆదాయ వనరు పంటలు మాత్రమే. కానీ ఒక ప్రక్క ప్రకృతి, మరొకప్రక్క మార్కెట్ ధరల యంత్రాంగం మూడో పక్క చీడ పీడలు పంటల రాబడిని గాలిలో దీపం చందంగా మారుస్తున్నాయి.

మన రాష్ట్రం విషయమే చూసినా గత ఏడాది తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల వల్ల రైతు నష్టపోయాడు. ఈ ఏడాది విపరీతమైన వానల వల్ల కోలుకోలేని అప్పుల వూబిలో చిక్కుకపోయాడు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడల్లా ప్రభుత్వం రైతుకు నష్టపరిహారం చెల్లించడం ఒక ధర్మకార్యంగా భావిస్తున్నాయి. ముష్టి వేసినట్లుగా వుంటున్నది ఆ పరిహారం. ముఖ్య మంత్రి ఒక మొత్తం చెప్తాడు. ప్రతిపక్షాలు దాన్ని పదింతలు పెంచమంటాయి. కానీ చివరకు ముఖ్య మంత్రి చెప్పే మొత్తం కూడా చేతికి అందదు. ఎన్నో ఏళ్లుగా రైతుల జీవితాలతో చెలగాట మాడుతున్నాయి ప్రభుత్వాలు.

ఈ సమస్యకు పరిష్కారం పంట బీమా ఒక్కటే అని గత నలభై ఏళ్లుగా గోల చేస్తున్నారు రైతులు. కానీ ఈనాటికీ ఒక నికరమైన, నమ్మకమైన పంట బీమా పథకాన్ని కనిపెట్టలేక పోతున్నారు పాలకులు.

1985లో మొదటి సారిగా పంట బీమాను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత సమగ్ర పంట బీమా పథకం పేరిట సగం దేశానికి విస్తరింప చేశారు. కానీ ప్రభుత్వానికి వచ్చే బీమా ప్రీమియం, చెల్లించవలసిన పరిహార మొత్తానికి పొంతనే కుదరక పోవడంతో 1997లో దాన్ని రద్దు చేశారు. ఆ వెంటనే చిన్న రైతుల కోసం, అది కూడా పంట రుణాలు పొందలేని వారి కోసం ఒక పంట బీమా పథకం ప్రవేశపెట్టారు. కానీ ఒక్క ఏడాదిలోనే దాన్ని ఉపసంహరించారు. పంట బీమా అంచనాకు తాలూకా లేదా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల ఆ పథకంలో ఉపయోగం కంటే దుర్వినియోగమే ఎక్కువగా జరిగింది. తర్వాత రైతు రాబడికి హామీ లక్ష్యంతో మరొక బీమా పథకం ప్రవేశపెట్టారు. పండే పంట, మద్దతు ధరల ఆధారంగా రైతుకు కనీస రాబడి హామీ ఇవ్వడం దీని లక్ష్యం. ఏ కారణం వల్లనైనా రైతుకు కనీస రాబడి రాకపోతే, ఆ లోటును పూరించడం దీని కార్యాచరణ. కానీ దానిలోనూ ఎన్నో సమస్యలు తలెత్తాయి. 2004లో దాన్ని రద్దు చేశారు.

ఇప్పుడు జాతీయ వ్యవసాయ బీమా పథకం ఒక్కటే అమలులో వుంది. దీని క్రింద పంట రుణాలు ఇచ్చే బ్యాంకులు మాత్రమే లాభ పడుతున్నాయి తప్ప రైతులకు నిజమైన ఉపయోగం జరగడం లేదు. అందువల్లనే వారు ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడల్లా ప్రభుత్వ దయా ధర్మం మీద ఆధారపడక తప్పడం లేదు.

జమీన్‌రైతు

నూటికి డెబ్భై మంది ప్రజలు జీవనం సాగించే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక భద్రత లేనంత కాలం దేశం నిజమైన ప్రగతి సాధించినట్లు కాదు. అది కొంత క్లిష్టమైన ప్రక్రియ కావచ్చు. ఆచరణలో లెక్క లేనన్ని సవాళ్లు ఎదురవుతూ వుండవచ్చు. అట్లని ఆ రంగాన్ని మొత్తంగా దైవాదీనానికి వదలి పెట్టడం సమంజసం కాదు. మార్కెట్ ధరల వ్యత్యాసం వచ్చినప్పుడు మద్దతు ధర రక్షణ వున్నట్లే, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టం నుంచి రక్షణ వుంటే, రైతు మరింత ఉత్సాహంగా వ్యవసాయం చేయగల్గుతాడు. దానివల్ల ఉత్పాదకత పెరుగుతుంది. జీవన ప్రమాణాలు పెరుగుతాయి. దేశం అసలైన ప్రగతి సాధిస్తుంది. సమాచార వ్యవస్థలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సాధించిన విప్లవాత్మక పురోగతిని వినియోగించి, రైతు జీవితానికి భద్రత కల్పించే పంట బీమా పథకం రూపొందించడం పాలకుల కర్తవ్యం. అది ఎంత త్వరగా జరిగితే దేశానికి అంత మేలు.

జనవాక్కు

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మ సార్థకం!

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గూర్చి అక్టోబర్ 18వ తేది 'జమీన్‌రైతు' సంచికలో పరోపకారం పరమార్థమని ఎరిగిన ప్రభాకర్‌రెడ్డి శీర్షికన వచ్చిన వ్యాసాలు అత్యద్భుతంగా ఉన్నాయి. పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం అనే సూక్తిననుసరించిన ప్రభాకర్‌రెడ్డి పుణ్యాత్ముడు. పరుల కోసం బతికేవాడే జీవించిన వాడు. అలా జీవించని వాడు బతికి వుండీ చచ్చినవాడే అన్నారు స్వామి వివేకానందుడు. అసలు ఈ శరీరం వచ్చిందే పరోపకారం కోసం. పరోపకారార్థం మిదం శరీరం అన్నది మరో సూక్తి. ప్రభాకర్‌రెడ్డి ఋషి వ్యాలీ స్కూల్ అనుభవం నిశ్చయంగా గొప్ప ప్రభావాన్నే ముద్రించి ఉంటుంది. లేత మనసు పొందిన శిక్షణ జీవితాంతం ఉంటుంది. దాతలనబడే వారెక్కువ శాతం వాగ్దాతలే. చెయ్యి విదల్చరు. శ్రీ రామకృష్ణ సేవా సమితి ముఖ్య కార్యకర్తగా ఇది నా స్వానుభవం. ప్రపంచ విఖ్యాత తత్వవేత్త మహాత్మా జె.కె ప్రతి ఏటా డిశంబరు – జనవరి మాసాల్లో విధిగా ఋషి వ్యాలీలో కొన్నాళ్లు గడుపుతారు. ఇది ఫిబ్రవరి 1986లో వారి నిర్యాణం వరకు సాగింది. ఆయన ఋషి వ్యాలీలో వేంచేసి ఉన్నప్పుడు పిల్లలతో సత్సంగం చేసేవారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏదో కొంత ఇవ్వడం కాదు. వారి ఫిలాసఫీలో దాతృత్వం ముఖ్యమైనది. ఆయన అభినందనీయులు.

శారదాకుమార్ నెల్లూరు

అశోక్‌బాబు మంచోడు!

అక్టోబర్ 18వ తేది 'జమీన్‌రైతు' సంచికలో 'సిఎం చేతిలో కీలుబొమ్మ అశోక్‌బాబు' శీర్షికన ఒక వార్త ప్రచురించారు. ఈ అంశంలో ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షునిగా, ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా దీర్ఘకాలం అశోక్‌బాబుతో కలిసి పనిచేసిన అనుభవంతో, అలాగే అతడి వ్యక్తిత్వాన్ని దగ్గరగా పరిశీలించిన వ్యక్తిగా ఈ వార్తపై కొంత వివరణ ఇవ్వడం నా బాధ్యతగా భావిస్తున్నాను. విభజన కొరకు తెలంగాణ ఉద్యోగుల జెఏసి సమ్మె బాట పట్టినప్పుడే ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కూడా కౌంటర్ ఉద్యమం ప్రారంభించాలని అప్పటి జెఏసి ఛైర్మన్ గోపాలరెడ్డిపై ఒత్తిడి వచ్చినా, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో ముందుకు సాగకుండా సీమాంధ్ర రాజకీయ నాయకులు అడ్డుపడతారనే నమ్మకంతో, ప్రత్యేక ఉద్యమం చేస్తే సీమాంధ్ర ఉద్యోగులను తెలంగాణ ఉద్యోగులు ఇబ్బందులు కలిగిస్తారనే ఆందోళనతో క్యాడర్‌కు నచ్చజెప్పారు. ఆ తర్వాత జెఏసి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌బాబు ఆ తర్వాత ఏర్పడిన పరిస్థితులను గమనించి సోదర సంఘాలను, ఎపి ఎన్జీఓల సంఘం కార్యవర్గ సభ్యులను సలహా కోరడం జరిగింది. ఈ విషయంలో సిఎం సానుకూలమా? వ్యతిరేకమా? అనే అంశాన్ని ఎపి ఎన్జీఓల సంఘం పరిగణనలోకి తీసుకోలేదు. ఎపి ఎన్జీఓల సంఘంలో అధ్యక్షుడు సమ్మెలు, సంప్రదింపుల విషయంలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేదు.

సి.హెచ్.హనుమంతరావు నెల్లూరు

70 ఏళ్ల క్రితం ఈవారం

5-11-1943
పేజీలు:6 వెల: 0-1-6అణా

మనవార్తలు

గతవారం నెల్లూరులో జాతీయ బాల సంఘం యేర్పడ్డది. ఆ సంఘంలోని వారందరూ మన బాలాభిమన్యు వ్రాసిన బాల యోధులం అనే పాట పాడుచూ, ప్రతిరోజు సాయంత్రం ఆటపాటలతో, జాతీయతా చింతతో కాలం గడుపుతూ వాళ్లు డ్రిల్లు నేర్చుకుంటున్నారు. మన జాతీయ నాయకుల జీవిత చరిత్రలను పెద్దల చేత చెప్పించుకుంటూ రాజకీయ చింతను అలవరచుకుంటున్నారు.

ఈ మధ్య (ఇపుడు గూడ) నెల్లూరులోని కట్టెల కరవు విషయమై జిల్లా కలెక్టరు వద్దకు జాతీయ యువజన సంఘం, విద్యార్థి సంఘముల యాజమాన్యమున పౌరుల యాత్ర సాగింది. యాత్రలో పాల్గొనమని పౌరులను హెచ్చరించు కరపత్రాలను, 20 మంది జాతీయ బాలకులే నెల్లూరు పట్టణమంతా పంచిపెట్టారు. మరునాడు వారు గూడ యాత్రలో పాల్గొన్నారు. సంఘ సేవలో నిమగ్నులై, సద్గుణాలను అలవర్చుకుంటున్న నెల్లూరులోని మనుషుల మంటే, ముచ్చటపడకుండా యెట్లా వుంటాను? మీరంతా గూడా ఆ విధంగా ప్రజాసేవలో నిమగ్నులు కావాలి.

రాపూరు బస్సు

ఈనాడు గూడూరు దారిన ఒకటే బస్. సైదాపురం, చాగణం మధ్యలో మైకా గనుల వారు ఎంతో దూరాన్నుండి వచ్చి కాచుకొని యుంటారు పిల్లలు ఆడవాండ్రు సహా. ఇంత కాచుకొని యుంటే చివర్న ఎక్కించుకుంటారనే నమ్మకం లేదు. అసలు చార్జి నిర్ణయమే లేదు. కండక్టరు వారిది సౌమ్యంగా మాట్లాడే నాలుకగా కనుపించదు. సర్వీసు వారన్నా ప్రయాణీకుల యిబ్బందులు తీర్చడం అవసరం.

–కాశింసా

50 ఏళ్ల క్రితం ఈవారం

1-11-1963
పేజీలు: 12 వెల: 0-20 న.పై

చీరెల స్వీకరణకు మంత్రిణి సదాలక్ష్మి సమర్థన

ఆగష్టులో నెల్లూరు జిల్లాలో సంచరించినప్పుడు దేవాలయాల నుండి చీరెల కాన్కలు స్వీకరించడం అనుచితమని, వాటిని తిరుగా యిచ్చివేయ వలసిందని వెన్నెలకంటి రాఘవయ్య గారు వ్రాసిన లేఖకు, దేవాలయాల మంత్రిణి శ్రీమతి సదాలక్ష్మి ఈ విధంగా జవాబు వ్రాసింది –

"గొప్పవారు వచ్చినప్పుడు వారిని గౌరవించడం హిందూ దేవాలయాల ఆచారంగా, సాంప్రదాయంగా చిరకాలంగా ఆచరణలో వుంటున్న పద్ధతి. భారత రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి, ప్రధానికి, ముఖ్యమంత్రులకు, మంత్రులకు, యింకా పలువురు పెద్దలకు అనేక దేవాలయాలు మర్యాదలు జరపడం నాకు తెలుసు. అలాంటి మర్యాదలు పొందినవారిలో నేనూ ఒకదాన్ని మాత్రమే. అందువల్ల, మీరు ప్రస్తావించిన దేవాలయాల నుండి నేను మర్యాదలు (చీరలని భావం – సం.జ.రై) స్వీకరించడంలో తప్పేమీ లేదు. దేవాలయాలు ఇలాంటి మర్యాదలను తమ ఇష్టానుసారం చేస్తాయి. సాధారణంగా వీటిని అంగీకరించకపోవడమంటే ఆ దేవాలయాలనే అవమానించినట్లుగా పరిగణింపబడుతుంది. అలాంటి మర్యాదలను తిరస్కరించడం వల్ల భగవదాగ్రహానికి గురికావలసి వస్తుందేమోనని, దైవభక్తి గలవారు భావిస్తారు. ఇదేమి రహస్యంగా స్వీకరించినది కాదు. వందలాది ప్రజల సమక్షంలో ఈ మర్యాదలు జరిగినవి; ఒక్కరు గూడా వాటిని ఆక్షేపించలేదు. అదీగాక, మనది మతాతీత రాజ్యము కాబట్టి, మత సంస్థల ఆచార సాంప్రదాయాలలో అనుచిత జోక్యం కల్పించుకోవడంగా వుంటుంది కాబట్టి, గొప్పవారికి ఆలయ మర్యాదలు జరుపవద్దని ఆదేశించుట చట్ట విరుద్ధమవుతుంది.

బాధ్యతగల మంత్రిణి ఈ విధంగా సమాధానమివ్వడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

నెల్లూరు ముచ్చట్లు

ఊపు తగ్గిన ఉద్యమం

జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం ఊపు తగ్గింది. ఎన్టీఓల సమ్మె సమయంలో నగరంలో ప్రతిరోజూ పది ప్రదర్శనలు, మరో చోట ధర్నాలు, ఇంకో చోట రాస్తారోకోలతో ఉవ్వెత్తున నడిచిన ఉద్యమం ఒక్కసారి చల్లబడి పోయింది. కలక్టరేట్‌లో ఉద్యోగులు ఒక రోజు మధ్యాహ్న భోజన సమయంలో చిన్న పాటి నిరసన, మరో రోజు రాస్తారోకో వరకే ఉద్యమం పరిమితమయ్యింది. ఉద్యమాన్ని నడిపే నాయకుడు లేకుండా పోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందనాలి.

ఎర్రగడ్డలు @ 70 రూపాయలు!

నెల్లూరీయులు వంటలో తప్పని సరిగా ఉపయోగించే ఎర్రగడ్డల రేటు పైకి ఎగబ్రాకి బ్రాకి ప్రస్తుతం 70 రూపాయల వద్దస్థిరపడింది. ఎసి కూరగాయల మార్కెట్‌లో ఈ రేటుకు మధ్య రకం సైజున్న పచ్చి ఎర్రగడ్డలు ఇస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఆరబెట్టిన ఎర్రగడ్డలు దొరకవని దబాయిస్తున్నారు. ప్రస్తుతమున్న 70 రూపాయల రేటు ఇంకా పెరిగే అవకాశముందే తప్ప తగ్గేది లేదంటున్నాయి వ్యాపార వర్గాలు.

కొండెక్కిన కూరగాయల ధరలు

ఇటీవల కురిసిన వర్షాల మూలంగా ఒక్కసారిగా కూరగాయల రేట్లు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతీయులు అల్లాడి పోతున్నారు. కిలో పది రూపాయలకు దొరుకుతుండిన నాటు రకం టమోటా ఒక్కసారి 50 రూపాయలై పోయింది. నెల్లూరీయులు ఇష్టంగా తినే తెల్ల వంకాయలు కిలో 50 రూపాయల ధర పలుకుతున్నాయి. బీర, కాకర, బీన్స్, క్యారెట్ కూడా 50 రూపాయలమ్మడం విశేషం. బెండకాయలు, దొండకాయలు, దోస కాయలు మాత్రం కిలో 30 రూపాయలకు దొరుకుతున్నాయి. గోంగూర మినహా ఆకు కూరలేవీ డిమాండ్‌కు తగ్గట్లు మార్కెట్‌లో దొరకడం లేదు. ప్రస్తుతమున్న కూరగాయల రేట్లు ఇంకా పెరగడం తప్ప తగ్గేది లేదంటున్నాయి. ఎసి కూరగాయల మార్కెట్ వ్యాపారులు.

పూర్తి సామర్థ్యానికి సోమశిల?

సోమశిల ప్రాజెక్ట్‌లో ఈ యేడాది పూర్తి సామర్థ్యంలో నీరు వచ్చి చేరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం, ఈశాన్య ఋతుపవనాల మూలంగా రాయలసీమ జిల్లాలలో మంచి వర్షపాతం నమోదవ్వడంతో ఆ నీరంతా సోమశిల వచ్చి చేరుతున్నాయి. 30వ తేది 63 టిఎంసిల నీటి నిల్వ ఉన్న ప్రాజెక్ట్ మరో వారం రోజుల్లో పూర్తి సామర్థ్యం 72 టిఎంసిలకు సంతరించుకొనే అవకాశముందని ఇరిగేషన్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మధ్య 2010సంవత్సరంలో ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం నీళ్లతో కళకళలాడింది. మూడేళ్ల విరామం తర్వాత మళ్లీ ఈ స్థాయి సమకూరడం పట్ల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తుంది. ఈ నీటిని కండలేరుకు అటు నుంచి చిత్తూరు జిల్లాకు తరలించకుండా కాపు కాయాల్సిన బాధ్యత రైతు సంఘాలు, రాజకీయ పార్టీల మీదుంది.

రొట్టెల పండుగ 15వ తేది?

హిందూ–ముస్లిం సోదరుల మధ్య మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండుగ ఈ నెల 13, 14, 15 తేదీల్లో బారాషహీద్ దర్గాకు ఆనుకొని ఉండే స్వర్ణాల చెరువు దగ్గర జరుగనున్నది. మొహరం నెలను బట్టి పండుగ ముగిసిన మరుసటి రోజు రొట్టెల పండుగను చేయాలి. జన సామర్థ్యాన్ని తట్టుకోలేక మూడు, నాలుగు రోజులు ఈ పండుగ జరపడం రివాజుగా మారింది. బారాషహీద్ దర్గా అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఊదరగొట్టారు. కానీ చిన్న పనికి కూడా శంకుస్థాపన జరగలేదు. ఇక్కడ అభివృద్ధి పనులు చేయను ఇంకెన్ని రొట్టెల పండుగలు జరగాలో?

పిసిసి అధికార ప్రతినిధిగా చెంచలబాబు!

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్‌ను నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. చెంచల బాబుకు ఈ పదవి పార్టీలో పెద్ద ప్రమోషన్ క్రిందే లెక్క

ఇస్కాన్ సంస్థకు నిర్లక్ష్యపు జబ్బు!

ఇస్కాన్ సంస్థ అంతర్జాతీయంగా పేరుగాంచింది. నెల్లూరులో ఈ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ సుఖదేవస్వామి మంచితనం వల్ల బాగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకొనే పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి వార్చే కాంట్రాక్టు సైతం పాత జిల్లా కలెక్టర్ సహకారంతో చేజిక్కించుకొంది. ఇటీవల మూతబడిన స్కూళ్లు తిరిగి తెరుచుకోగా ఈ సంస్థ వండి పంపిన మధ్యాహ్న భోజనంలో పురుగులు కనపడ్డాయి. దీనిపై రగడ రేగగా ఇస్కాన్ ఫుడ్ రిలీఫ్ ఫౌండేషన్ సభ్యులు చెప్పిన సమాధానం సహేతుకంగా లేదు. పురుగులున్న బియ్యాన్ని ఏరే మిషన్ చెడిపోయింది. పాత బియ్యాన్ని ఏరక పోవడం వల్ల ఇలా జరిగింది. మధ్యాహ్న భోజనం ప్రాజెక్టు వల్ల గడచిన ఐదేళ్లలో ఇస్కాన్‌కు 35 లక్షల రూపాయలు నష్టమొచ్చినట్లు చెప్పారు. ఇస్కాన్ లాభాపేక్షతో నడిచే సంస్థ కాదు. అసలు పురుగులున్న బియ్యాన్ని వండి వార్చి స్కూళ్లకు పార్శిల్ చేసి పంపడం పెద్ద పొరపాటు. దీనికి క్షమాపణలు కోరడమొక్కటే ప్రాయశ్చిత్తం.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.2000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.250/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

చెడామడా ఆడేసుకొన్నారు.

తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు బల్లి దుర్గాప్రసాద్, పరసా రత్నం సీనియర్లు. ఇద్దరూ రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన వాళ్లు. కానీ జిల్లా అధికారులు వీరిని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొన్న వీళ్లు 28వ తేది కలక్టరేట్‌లోని గోల్డన్ జూబ్లీ హాల్‌లో జరిగిన అట్రాసిటీ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీలను చెడుగుడు ఆడేశారు. జిల్లాలో ఒక్క దళితుడికైనా న్యాయం చేశారా? పోలీస్ స్టేషన్‌లో దళితుల ఫిర్యాదులు తీసుకొంటున్నారా? తీసుకొన్న వాటిపై చర్యలేవి? చట్టాలను కాపాడలేనప్పుడు ఖాకీ డ్రస్సెందుకని సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసా రత్నం ఎస్పీని ప్రశ్నించే సరికి ఆయన సమాధానం చెప్పలేకపోయారు. గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అట్రాసిటీ కమిటీ సమావేశాలు డివిజన్ కేంద్రాలలో పెడితే ప్రయోజనం వుంటుందన్నారు. ఈ సలహా పాటిస్తామని కలెక్టర్ శ్రీకాంత్ చెప్పారు. మరోసారి ఎస్సీ అట్రాసిటీ కేసులపై పోలీసుల చర్యలపై మాట రానివ్వనని ఎస్పీ రామకృష్ణ సమావేశంలో ఎమ్మెల్యేలకు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

మూడు చోట్ల టపాసుల దుకాణాలు!

దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రజల సౌకర్యార్థం నెల్లూరు నగరంలో మూడు ప్రాంతాల్లో టపాసుల అంగళ్ల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం అనుమతిచ్చింది. విఆర్ కాలేజి గ్రౌండ్‌లో 80 దుకాణాలు, వైఎంసిఏ గ్రౌండ్‌లో 27, నవాబుపేటలోని ఆర్ఎస్ ఆర్ హైస్కూల్‌లో 23 దుకాణాలు ఏర్పాటు చేస్తారు. ఇక్కడ అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పోలీస్ పికెట్లు సైతం ఏర్పాటు చేస్తారు. నగర ప్రజలు ఇక్కడకు వెళ్లే టపాసులు కొనుక్కోవాల్సి వుంటుంది.

కొత్త కమాండెంట్!

వెంకటగిరిలోని 9వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా బి.మోహన్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తుండిన నాగూర్‌రెడ్డి కరీంనగర్‌కు బదలీ అయ్యారు. తాడిపత్రిలోని 14వ బెటాలియన్ నుంచి బి.మోహన్ వెంకటగిరి వచ్చారు.

వైకాపా యువజన విభాగంలో విజయకుమార్‌రెడ్డి!



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగంలోముత్తుకూరు మండలం జంగాలకండ్రిగకు చెందిన వాకాటి విజయకుమార్ రెడ్డికి స్థానం దక్కింది. ఆయన్ను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించారు. విజయకుమార్ రెడ్డి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరాభిమాని. కర్ణాటక, తమిళనాడుల్లో రైల్వే కాంట్రాక్టర్‌గా స్థిరపడినా ప్రజాసేవ చేయాలన్న కోరికతో వైఎస్ఆర్ సిపిలో చేరారు. 2011 సంవత్సరం నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆయన సేవలకు మెచ్చి ఈ పదవిని చ్చారు. ముత్తుకూరు మండల రాజకీయాల్లో విజయకుమార్‌రెడ్డి బాగా బలమున్న నాయకుడనాలి.

మలేషియాలో కవి సమ్మేళనానికి పెరుగు!

మలేషియా దేశంలోని పేరాక్ రాష్ట్ర రాజధాని ఇపోహ్ నగరంలో జరిగిన 33వ వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పొయెట్స్ సమావేశంలో నెల్లూరు కవి పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు. 20 దేశాల నుండి 152 మంది కవులు ఈ కవి సమ్మేళనానికి వచ్చారు. పేరాక్ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ జంబ్రి అబ్దుల్ ఖాదిర్ స్వయంగా కవి కావడం వల్ల పూర్తి రాజ్యగౌరవాలతో కవులను ఆదరించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన విశ్వకవితా సంకలనంలో పెరుగు రామకృష్ణ భారతీయ కవిగా నమోదయ్యారు.

కేంద్ర నేతలవి నాటకాలు

సమైక్యాంధ్రపై కేంద్రంలోని కాంగ్రెస్ నేతలు నాటకాలాడుతున్నారని సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ప్రజల ముందు

కొరవ 14వ పేజీలో

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా...
AMMA FURNITURE MALL
అమ్మ ఫర్నిచర్ మాల్
సువిశాలమైన భవంతిలో కనులను మైమరపించే వందలాది డిజైన్లతో విభిన్న మాడల్స్ మీ కోసం... విచ్చేయండి.
AMMA FURNITURE MALL
మినీబైపాస్‌రోడ్డు, నెల్లూరు.
ఫోన్: 0861-2302234

వజ్రం - బంగారం - వెండి ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరి అవుట్‌లెట్
925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121

రైలు పట్టాల ఏర్పాటులోనూ
అవినీతి అక్రమాలు



రైలు పట్టాల నిర్మాణాల్లో నాణ్యత కరువవుతుండడంతో రైళ్ల రాకపోకలకు తరచూ ఆటంకాలు ఎదురౌతూ ప్రయాణీకులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పట్టాల ఏర్పాటు, కంకర లెవలింగ్ ఇతరత్రా పనుల్లో కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తిపడడం, నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చి నాసిరకంగా పనులు చేస్తుండడం, పనులపై అధికారుల నిఘా కొరవడడం, తూతూమంత్రంగా తనిఖీలు జరుపుతుండడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురు కావడంతోపాటు రైలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వేలాది మంది ప్రయాణీకుల జీవితాలతో ముడిపడి వున్న ఈ అంశంపై రైల్వే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బ్రిటీష్ పాలనలో వేసిన రైలు పట్టాలు ఇంకా నాణ్యంగా వుండి ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా సాఫీగా రైళ్లు ప్రయాణిస్తుంటే, ఇటీవల కాంట్రాక్టర్లు చేపట్టిన రైలు పట్టాల ఏర్పాటు పనుల్లో డొల్లతనం బహిర్గతమవుతోంది. దీంతో బోగీలు కుదుపులకు గురి కావడం, పట్టాలు విరగడం లాంటి ఘటనలు చోటుచేసుకొంటున్నాయి. రైలు పట్టాలు ఏర్పాటుచేసే సమయంలో రైల్వే శాఖ కొన్ని నియమనిబంధనలు విధించింది. పట్టాల క్రింద వేసే కంకరలో తగిన ప్రమాణాలు పాటించాల్సి వుంది. దీని ప్రకారం 30 ఎంఎం కంకర వాడాల్సి వుండగా పనులు చేసే కాంట్రాక్టర్లు కేవలం 10 ఎంఎం, 15 ఎంఎం కంకర వినియోగిస్తున్నారు. ఫలితంగా పట్టాల్లో గట్టితనం లోపించి రైళ్ల వేగానికి పట్టాలు విరిగిపోతున్నాయి. జిల్లాలోని మనుబోలు, గూడూరు, కావలి, బిట్రగుంట, మార్గాల్లో పలుమార్లు వివిధ రైళ్ల రాకపోకల సందర్భంగా పట్టాలు విరగడం, ఆటంకాలు ఏర్పడడం తెలిసిందే. ఇటీవల మనుబోలు వద్ద విరిగిన రైలు పట్టాలను గుర్తించి సరిచేయడంతో కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. కండలేరు వంతెన సమీపంలోనూ జైపూర్ ఎక్స్‌ప్రెస్ కుదుపులకు గురి కావడంతో ప్రయాణీకులు హడలి పోయారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి వేగాన్ని నియంత్రించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇప్పటికైనా రైల్వేశాఖ ఉన్నతాధికారులు రైలు పట్టాల నాణ్యతపై పర్యవేక్షణ జరిపి సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుకొంటున్నారు.



డిఇఓ నోటిదురుసు!

టీచర్లు కాకులంటూ వివాదాస్పద వ్యాఖ్యలు

జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం వ్యవహారశైలి ఆది నుంచి వివాదాస్పదమే. అని అన్పించుకోవడం ఆయనకు ఒక అలవాటు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఉపాధ్యాయులు పాల్గొని పాఠశాలకు పోకుండా సమ్మెలో పాల్గొన్నారు. దీంతో జిల్లాలోని అధిక భాగం పాఠశాలలు మూతపడ్డాయి. కొంత మంది ఉపాధ్యాయులు మాత్రం విధులకు హాజరయ్యారు. ఇటీవల డిఇఓ రామలింగం సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు కోకిలలని, ఉద్యమంలో పాల్గొనకుండా పాఠశాలలకు వెళ్లిన టీచర్లు కాకులంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమయ్యింది. బాధ్యతాయుతమైన అధికారి ఇలా కొందరు ఉపాధ్యాయులను కించపరుస్తూ ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడడంపై పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొనడం, పాల్గొనకపోవడం అనేది వ్యక్తిగత అభిప్రాయమని, విద్యార్థులను దృష్టిలో వుంచుకుని పాఠశాలలకు వెళ్లి బోధన చేసిన తమను అభినందించకపోయినా పర్వాలేదని, కానీ కాకులతో పోలుస్తూ వంకరగా మాట్లాడడం ఏమిటని పలువురు ఉపాధ్యాయులు డిఇఓ రామలింగం వ్యవహారశైలిని ప్రశ్నిస్తున్నారు. గతంలోనూ పలు సమావేశాల సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన వెకిలిగా మాట్లాడిన విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్న వారు దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు డిఇఓను నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా ఎన్జీఓ అధ్యక్షుడుతో గొడవ పడిన విద్యాశాఖాధికారి రామలింగం ఇప్పుడు నోటి తుత్తరతో ఉపాధ్యాయులను వెకిలిగా మాట్లాడి విమర్శలు ఎదుర్కొంటున్నాడు. అదో తుత్తి రామలింగానికి.

ఆధార్ కార్డుకావాలని జిల్లా అధికారుల ఒత్తిడి!

సుప్రీంకోర్టు ఆదేశాలు పట్టవా?

ఆధార్ కార్డు కేవలం గుర్తింపు కార్డుగానే పరిగణించాలని సంక్షేమ పథకాలకు వర్తింపచేయరాదంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం జారీచేసిన ఉత్తర్వులు జిల్లాలో అమలు కావడం లేదు. నగదు బదలీ పథకానికి ఆధార్‌ను అనుసంధానం చేస్తూ కేంద్రం నిర్ణయించడంపై కొందరు దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఆధార్ సంఖ్య తప్పనిసరి కాదంటూ తీర్పునిచ్చింది. దీంతో డిసెంబర్ ఆఖరు వరకు కేంద్రం గడువు పొడిగించాల్సి వచ్చింది. అయితే జిల్లాలో స్కాలర్ షిప్పులు, ఇతర సంక్షేమ పథకాల మంజూరుకు ఆధార్ కార్డు తప్పనిసరిగా జత చేయాలంటూ చెబుతున్నారు. ఇంటర్, డిగ్రీ కోర్సులతోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదివే ఎస్సీ, ఎస్టీ బాల, బాలికలకు ప్రత్యేక స్కాలర్‌షిప్పు ఇవ్వనుంది. స్కాలర్‌షిప్పు పొందేందుకు తల్లితండ్రులతోపాటు బాల, బాలికలు కూడా ఆధార్ కార్డు కలిగి వుండాలి. కానీ కొందరు ఆధార్ కార్డు కోసం ఫోటోలు దిగని పరిస్థితి. ఈ నేపథ్యంలో సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాలను ఏమాత్రం లెక్క చేయకుండా వ్యవహరిస్తున్నారు. ఆధార్ కార్డును తప్పనిసరి చేయరాదంటూ పత్రికల్లో ప్రకటనలు వచ్చిన విషయం అధికారులకు తెలిసినా, తామేమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. 2014 జనవరి నుంచి నగదు బదలీ పథకం అమలు చేస్తామని అధికారులు ప్రకటిస్తున్నారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో వుండడంతో తుది తీర్పు వెలువడే వరకు ఆధార్ సంఖ్య నుండి మినహాయింపు పొందే అవకాశం వుంది.

దెబ్బతిన్న రోడ్డుపై
ప్రయాణించడం ఎలా?

- మద్రాస్ బస్టాండ్ నుంచి ఆర్టీసి వరకు ఒకవైపు దెబ్బతినిపోయిన రోడ్డు



జిల్లా కోర్టుకు తూర్పువైపు దెబ్బతిని పోయిన జిఎన్‌టి రోడ్డు.

నగరంలోని ప్రధాన రహదారితోపాటు పలు ప్రాంతాల్లోని రోడ్లు చిద్రమై పోయాయి. ఒకవైపు సిమెంటు రోడ్లు వేసుకొంటూ పోతుంటే మరోవైపు దెబ్బతిని మూణ్ణాళ్లకే అధ్వాన్నంగా తయారవుతున్నాయి. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అడుగడుగునా అవినీతి తాండవిస్తుండడంతో కొత్తగా వేసిన రోడ్లు ఎక్కువ కాలం మనడం లేదు. దీనికితోడు ప్రధాన రహదారి చాలా చోట్ల గుంటలు మిట్టలుగా తయారవడంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వాళ్లు ఒళ్లు గుల్లయి పోతోంది. పెద్ద పెద్ద గుంటలు పడి వుండడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు కుదుపులకు లోనవుతుండడంతోపాటు పలువురు ప్రమాదాలకు గురౌతున్నారు. ముఖ్యంగా మద్రాస్ బస్టాండ్ వద్ద నుంచి ఆర్టీసి వరకు అయ్యప్పగుడి వైపు వెళ్లే రోడ్డు ధ్వంసమై రూపురేఖలు కోల్పోయి వుంది. వెతికినా ఒక్క చోటైనా గుంటలు లేని ప్రాంతం కన్పించని విధంగా రోడ్డు దెబ్బతిని వుంది. నిత్యం గుంటలు పడిన ఈ రోడ్డుపై ప్రయాణిస్తుండడంతో పలువురు అనారోగ్యానికి గురౌతున్నారు. స్పాండిలైటిస్ తదితర సమస్యలతో సతమతం అయ్యే వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా వుంటోంది. కోర్టువైపు సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తయిన తక్షణం మరోవైపు రోడ్డు పనులు చేపడుతున్నట్లు ప్రజాప్రతినిధులు ప్రకటించినా ఇంతవరకు కొత్త రోడ్డు నిర్మాణ పనులు జరగకపోగా ధ్వంసమైపోయిన రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టలేదు. కనీసం పెద్ద పెద్ద గుంటల్లో తట్ట మట్టి వేయాలన్న జ్ఞానం సంబంధిత అధికారులకు లేకపోవడం పట్ల నగర వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిఐపిలు వచ్చినపుడు, ప్రజాప్రతినిధులకు దగ్గరి వారి కుటుంబాల్లో ఫంక్షన్లు జరిగినపుడు హడావిడిగా రోడ్డు మరమ్మత్తులు చేపట్టే అధికారులకు సామాన్య ప్రజల బాగోగులు పట్టవని విమర్శిస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోక పాతబడిన జడ్పీ భవనం.

జడ్పీ కొత్త భవనానికి మరమ్మత్తులు!

కట్టి పట్టించుకోకపోవడమే కారణం

నెల్లూరు నగరంలోని టిబి ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన జిల్లా పరిషత్ నూతన భవనానికి మరమ్మత్తులు చేపట్టారు. జడ్పీ పాలకవర్గం హయాంలో ఈ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పది కోట్ల రూపాయల వ్యయంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భవనాన్ని నిర్మించడం జరిగింది. భవనం పూర్తయ్యే నాటికి అధికార పార్టీలో అప్పటి జడ్పీ ఛైర్మన్ విభేదించడం, భవనం కొంత అసంపూర్తిగా వున్నప్పటికీ ప్రారంభోత్సవం చేసిన సంగతి తెలిసిందే. భవనం లోపల ఇంకా పనులు చేపట్టాల్సి రావడంతో జిల్లా మంత్రి మరో మూడు కోట్ల రూపాయలు విడుదల చేయించడం జరిగింది. భవనం ప్రారంభించి దాదాపు ఒకటిన్నర సంవత్సరం గడిచి పోయింది. రాజకీయ వివేధాలతో భవనం గురించి ఎవరు పట్టించుకోవడం మానేశారు. మరమ్మత్తుల కోసం నిధులు విడుదల కావడంతో లోపల, బయట పనులు జరుగుతున్నాయి. రాజకీయ వివాదాల మధ్య చిక్కుకుని భవనం వినియోగంలోకి రాకుండాపోయింది. కోట్ల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన భవనం గురించి ప్రజాప్రతినిధులు సైతం విస్మరించడం విశేషం. ఒకటిన్నర సంవత్సరం అనంతరం నూతనంగా నిర్మించిన భవనానికి మరమ్మత్తులు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు పంచాయతీరాజ్ అధికారులు ముందుకు వచ్చారు. ఈ భవనం పూర్తిచేస్తే ఇరుకుగా వున్న పాత భవనంలో నుండి ఉద్యోగులు కొత్త భవనంలోకి మారే అవకాశం వుంది. జడ్పీ సిఇఓ మరింత చొరవ తీసుకుని త్వరతగతిన భవనం పూర్తి చేయించేందుకు కృషి చేస్తే బాగుంటుంది.

సర్వేపల్లిని వీడి వెళ్లను

గట్టిగా చెప్పిన ఆదాల

ఎటువంటి పరిస్థితుల్లోను సర్వేపల్లి నియోజకవర్గాన్ని వదిలే ప్రసక్తిలేదని సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల వెంకటాచలంలో జరిగిన ఒక కార్యక్రమంలో వచ్చే ఎన్నికల్లో సర్వేపల్లి నుంచి పోటీ చేస్తానో లేదో అని వ్యాఖ్యానించిన ఆయన వున్నట్లుండి మాట మార్చారు. ఇటీవల ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆదాల నివాసానికి తరలి వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీలో వుండడం వలన సాధించుకోగలిగానన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచేందుకు అవకాశమిచ్చిన కాంగ్రెస్ పార్టీకి, నమ్ముకొన్న కార్యకర్తలకు, వెన్నంటి వుండే నేతలకు ఎల్లప్పుడు రుణపడి వుంటానన్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన కార్యకర్తలకు, నేతలకు కృతజ్ఞతలు తెలుపుతూనే కాంగ్రెస్ పార్టీలో వుంటూ మరో పార్టీలోనూ హాజరు వేయించుకొంటున్న వారిని ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. దాగుడుమూతలు ఆడే వాళ్లు తనకు అవసరం లేదని, అలాంటి వారు పార్టీ వదలివెళ్లినా నష్టం లేదన్నారు. దీంతో కొందరి ముఖాల్లో నెత్తురు చుక్క లేకుండా పోయింది. ఈ కార్యక్రమంలో విజయా డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తోటపల్లిగూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోడూరు దిలీప్‌రెడ్డి, కావలిరెడ్డి రవీంద్రరెడ్డి, కావలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జ్వాలాముఖి ఆలయ ఛైర్మన్ సోమన శ్రీనివాసులురెడ్డి, కోడూరు దయాకర్‌రెడ్డి, అనపల్లి అశోక్‌రెడ్డి, ముత్తుకూరు మండల కాంగ్రెస్‌నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, వైవి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలో పాతతరం నగల వ్యాపారి దివంగత గుండాల సుబ్బారెడ్డి మనుమడు, రమేష్‌రెడ్డి కుమారుడు రాజేష్, అల్లూరు వాస్తవ్యులు బుల్లా రఘురామిరెడ్డి కుమార్తె సాయి ప్రశాంతిల వివాహం అక్టోబర్ 18వ తేది నెల్లూరు సిపిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు సన్మానం!

షిర్డి సాయి రూరల్ వెల్ఫేర్ అండ్ మెడికల్ ఫౌండేషన్ చేయూతకు కృతజ్ఞత!



బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న డాక్టర్ రాజశేఖర్. ప్రక్కన డాక్టర్ సత్యనాధ్, డాక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి.

వందల మంది పేదలకు గుండె ఆపరేషన్లు, వేల మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించడంతోపాటు నెల్లూరులోని రామ్‌నగర్‌లో ఆస్పత్రిని కూడా శ్రీ షిర్డిసాయి రూరల్ వెల్ఫేర్ అండ్ మెడికల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సంగతి నెల్లూరీయులకు విదితమే. ఈ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఆసుపత్రి ఏర్పాటయ్యేందుకు కారకుల్లో ఒకరైన ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 24తేదీ దీన్ని సందర్శించారు. ఫౌండేషన్ స్థాపకుల్లో ఒకడైన చర్మవ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలోని డాక్టర్ల బృందం బాలసుబ్రహ్మణ్యానికి సాదర స్వాగతం పలికింది. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బాలసుబ్రహ్మణ్యం అభినందన సభలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ముందు గుండె ఆపరేషన్లు జరిగేవి. ఒకసారి ఫౌండేషన్ సహాయం నిమిత్తం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారిని కలిశాం. ఒక సారి డొనేషన్ ఇస్తే ఒక్కరికి ఆపరేషన్ చేయిస్తారు. నేను సంగీత కచ్చేరి చేస్తాను. పది రూపాయలు మిగులుతాయన్నారు. ఆయన చెప్పినట్లే ఖర్చులుపోను కచ్చేరిలో 8 లక్షల రూపాయలు మిగిలాయి. ఈ డబ్బుతో ఈ హాస్పిటల్ నిర్మాణం ప్రారంభించి మిగతా దాతల సహకారంతో పూర్తి చేయించామన్నారు. ఇప్పటి వరకు ఫౌండేషన్ నేతృత్వంలో 400 గుండె ఆపరేషన్లు, ఆరు వేల కుపైగా కంటి ఆపరేషన్లు చేయించాం. దీనికి శ్రీకారం బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగానే జరిగిందన్నారు. దీనికి సమాధానంగా బాలసుబ్రహ్మణ్యం ప్రతిస్పందిస్తూ ఫౌండేషన్‌లో డాక్టర్లు చేసిన సేవకు తాను చేసింది ఉడతాభక్తి సాయమేనన్నారు. అనంతరం బాలసుబ్రహ్మణ్యంను ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ రాజశేఖర్, పిల్లల డాక్టర్లు మల్లిఖార్జునరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కంటి డాక్టర్లు పిఎల్.రావు, ఎవిఎస్.కృష్ణప్రసాద్, రబ్బానీబేగం, పిట్టి మల్లిఖార్జున సత్కరించారు. కార్యక్రమంలో షిర్డిసాయి రూరల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఇన్‌ఛార్జి కె.సురేంద్రరెడ్డి, డాక్టర్ కె.సత్యనాథ్ పర్యవేక్షించారు..

సిలికా ఖనిజం దోపిడీ!

సమైక్య ఉద్యమం మాటున రెచ్చిపోయిన స్మగ్లర్లు

అధికారులు రెండు నెలలపాటు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొనడంతో గూడూరు నియోజకవర్గంలో భారీగా ఖనిజ దోపిడీ జరిగిందని స్థానిక శాసనసభ్యుడు బల్లి దుర్గా ప్రసాద్ వెల్లడించారు. చిల్లకూరు, కోట మండలాల్లో 24లక్షల మెట్రిక్ టన్నుల సిలికా అక్రమ రవాణా జరిగిందన్నారు. అనుమతులు ఒక చోట పొంది ప్రభుత్వ భూముల్లోని సిలికాను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. చివరకు 17లక్షల మెట్రిక్ టన్నుల గులకను అక్రమార్కులు తరలించుకపోయారన్నారు. ఎస్‌బిక్యూ ఉక్కు పరిశ్రమకు కేటాయించిన భూముల వివరాలను, బాధితులకు అందజేసిన పరిహారం వివరాలను తెలియజేయాలని అడిగినా అధికారుల నుంచి స్పందన కరువైందన్నారు. ఎమ్మెల్యేనైన తనకే ఇలాంటి పరిస్థితి వుంటే ఇక సామాన్యుల సంగతేంటని ప్రశ్నించారు. అలాగే కినెట్ ధర్మల్ విద్యుత్ కేంద్రం భూకేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. దీనిపై సిఎంకు, టిడిపి అధినేత చంద్రబాబు లేఖలు వ్రాశారన్నారు.



విరాళం అందజేస్తున్న అనపల్లి అశోక్‌రెడ్డి.

● జ్వాలాముఖి ఆలయానికి

అశోక్‌రెడ్డి విరాళం

తోటపల్లి గూడూరు మండలం వరిగొండ జ్వాలాముఖి ఆలయ అభివృద్ధికి కోవూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి, దాతృత్వం కల్గిన అనపల్లి అశోక్‌రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఆలయ ఛైర్మన్ సోమన శ్రీనివాసులురెడ్డికి ఈ మొత్తాన్ని ఆయన అందించారు. అశోక్‌రెడ్డి దాతృత్వాన్ని కొనియాడిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆలయంలో మూడు కోట్ల రూపాయలతో అతిథి గృహాన్ని, కళ్యాణ మండపాన్ని నిర్మించడంతోపాటు పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జ్వాలాముఖి ఆలయ ప్రాశస్థ్యాన్ని, శక్తిని భక్తులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు మరింతగా ముందుకు రావాలని కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



కావలిలో ఆగని దొంగతనాలు!

దొంగతనాలను ఆరికట్టేందుకు పోలీసులు పలు చర్యలు తీసుకొంటున్నా అవేమీ ఫలితాన్నివ్వడం లేదు. పోలీసుల పని పోలీసులదే దొంగల పని దొంగలదే అన్నట్లు వుంది కావలి నియోజకవర్గంలో దొంగతనాల తీరు చూస్తే. రూరల్, బోగోలు, ముసునూరు ప్రాంతాలలో వరుస బెట్టి జరుగుతున్న చోరీలు ప్రజలను హడలెత్తిస్తున్నారు. చివరకు దేవుళ్లకూ రక్షణ లేకుండాపోయింది. పలు ఆలయాల్లో దొంగలు పడి ఆభరణాలు, హుండీలను తస్కరించేస్తున్నారు. ఇటీవల కావలి వచ్చిన ఎస్పీ రామకృష్ణ పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి దొంగతనాలను అరికట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇది జరిగి వారం తిరక్కుండానే ముసునూరులో దొంగతనం జరిగింది. రైల్వే ఉద్యోగి కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి బిట్రగుంటకు వెళ్లిన సమయంలో పట్టపగలే దొంగలు చొరబడి దోచుకపోయారు. పదిసవర్ల బంగారు, 10వేల రూపాయల నగదు దొంగతనానికి గురైంది. కావలి పట్టణంలోనూ ఇటీవల కాలంలో పలు ప్రాంతాల్లో దొంగతనాలు జరిగాయి. ఇక బోగోలు మండలంలోను దొంగలు పెట్రేగిపోతున్నారు. జువ్వలదిన్నెలో పెనుగొండమ్మ గుడిలో అమ్మవారి ఇత్తడి తొడుగులు, వెండి కిరీటాన్ని, హుండీ పగులగొట్టి డబ్బులు అపహరించుకొని వెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టడం, క్లూస్ టీమ్‌లురావడం, దొంగలను పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీసులు చెప్పడం షరా మామూలుగానే జరిగిపోయాయి.

ఆందోళనలో జనం



వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిపిన సమైక్య శంఖారావం సభకు గూడూరు వైకాపా నాయకుడు బత్తిన విజయకుమార్ నాయకత్వంలో బయలుదేరి వెళ్లిన కార్యకర్తలు.

● దగదర్తిని

చుట్టుముట్టిన సమస్యలు!

పరిష్కరించేవారెవరు?

దగదర్తి మండలంలోని పలు గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రోడ్లు సక్రమంగా లేక, వున్న రోడ్లు దెబ్బతినిపోయి గుంటలు మిట్టలు పడి వుండడం, డ్రైనేజి కాలువలు లేకపోవడంతో మండలంలోని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. దగదర్తి, పెద్దపుత్తేడు, ఉలవపాళ్ల, తురిమెర్ల, దామవరం, కాట్రాయపాడు, మనుబోలుపాడు, దుండిగం, వెలుపోడు, బోడిగాడిపాడు గ్రామ పంచాయతీల్లో పరిస్థితి అధ్వాన్నంగా వుంది. పారిశుధ్యం క్షీణించడం, గ్రామాల్లో అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, అనారోగ్యానికి గురౌతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం, పారిశుధ్య పరిస్థితుల మెరుగుకు చర్యలు చేపట్టకపోవడంతో అసౌకర్యాలు, అస్తవ్యస్థ పరిస్థితుల నడుమ మండల ప్రజలు జీవనం సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తగా వచ్చిన సర్పంచ్‌లైనా తమ సమస్యలు పరిష్కరిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురౌతోంది.

అస్తవ్యస్తంగా గ్యాస్ సరఫరా!

● ఉదయగిరి ప్రజల పాట్లు వర్ణనాతీతం.

జిల్లాలో గ్యాస్ సరఫరా గందరగోళంగా మారింది. నిన్న మొన్నటి వరకు జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమంలో అన్ని శాఖల ఉద్యోగులతోపాటు పౌర సరఫరాల శాఖ ఉద్యోగులు సమ్మెలో వుండిన ఫలితంగా పలు ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల సరఫరా సక్రమంగా జరగక వినియోగదారులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదార్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుక్ చేసిన మూడు నాలుగు నెలలు గడుస్తున్నా సిలిండర్లు సరఫరా జరగకపోవడంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం, మర్రిపాడు తదితర మండలాల్లో ఇలాంటి సమస్యలే ఎదుర్కొంటున్నారు గ్యాస్ వినియోగదారులు. ఉదయగిరిలోగల వెంగమాంబ గ్యాస్ ఏజన్సీ నుంచి చుట్టుప్రక్కల ప్రాంతాలకు భారత్ గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతుంటుంది. జూలై నెలలో బుక్ చేసినా ఇంత వరకు సిలిండర్లు సరఫరా జరగలేదని, కానీ సెల్‌ఫోన్‌లకు మాత్రం ఆగష్టు నెలలో సరఫరా జరిగినట్లు మెసేజ్‌లు వచ్చాయని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. దీనిపై గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా జవాబు చెబుతున్నారని వివిధ మండలాల ప్రజలు ఆగ్రహిస్తున్నారు. సిలిండర్ల సరఫరా సక్రమంగా చేయకుండా బ్లాక్‌లో అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేసే అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఉదయగిరి ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో సంగం ఆనకట్ట షట్టర్లు!

పట్టించుకోని నీటిపారుదల శాఖాధికారులు

లక్షల ఎకరాలు సాగు చేసుకొనేందుకు నీటిని అందిస్తున్న సంగం ఆనకట్ట షట్టర్లు శిథిలావస్థకు చేరుకొంటున్నాయి. నానాటికీ దెబ్బతిని పోతున్న షట్టర్లను, ఆనకట్ట బాగోగులను పట్టించుకొనే వారే లేకపోవడంతో సంగం ఆనకట్ట క్రింద సాగు చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు శిథిలమైపోయిన షట్టర్లు మరింతగా దెబ్బతింటుండడంతో ఆనకట్ట భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి. పెన్నా నదిపై సంగం వద్ద ఏర్పాటైంది ఈ ఆనకట్ట. సోమశిల జలాలను ఇందులో నిల్వచేసి ఆయకట్టు క్రింద సాగుచేస్తున్న భూములకు సాగునీటిని అందించడంతోపాటు తాగునీటి అవసరాలను తీర్చడంలో ఈ ఆనకట్ట కీలక పాత్ర పోషిస్తుంది. నెల్లూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో లక్షల ఎకరాల పంట సాగుకు నీటిని అందిస్తుంది. నీటి నిల్వ, ఉధృతిని తట్టుకొనేలా అప్పట్లో 386 షట్టర్లను ఏర్పాటు చేశారు. వీటి నిర్మాణం జరిగి వందేళ్లకుపైగా అవుతుండడంతో సహజంగానే షట్టర్లు పటుత్వం కోల్పోతాయి. తుప్పుపట్టి, శిథిలం కావడంతో చాలా భాగం నీరు లీకేజి రూపంలో వృధాగా సముద్రం పాలవుతోంది. ఎప్పుడైనా వరదలు సంభవించినా, తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకొన్నప్పుడు శిథిలమైపోయిన షట్టర్లు కొట్టుకొని పోతే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం వుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటి మరమ్మత్తుల గురించి పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

రొయ్యల గుంటలతో ఇక్కట్లు!

నిడిగుంటపాళెంలో ఇది పరిస్థితి

వెంకటాచలం మండలం నిడిగుంటపాళెంలో ఏర్పాటుచేసిన రొయ్యల గుంటలు హరిజన వాడలో కాపురం వుంటున్న వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తూర్పు దళితవాడ చుట్టూ రొయ్యలగుంటలు వుండడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో దాదాపు 60 కుటుంబాలు నివాసం వుంటున్నాయి. ఇటీవలి కాలంలో రొయ్యలకు మంచి డిమాండ్ వుండడంతో మాగాణి పొలాల రైతులు విస్తృతంగా అక్వాసాగు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకొని రొయ్యల సాగు చేస్తున్నారు రైతులు. ఇళ్ల చుట్టుప్రక్కల గుంటలు వుండడం, విద్యుత్ లైన్లు ఇళ్లపైనే వెళ్తుండడంతో ఎక్కడ ప్రమాదానికి గురౌతామోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఏరియేటర్ల కోసం ఏర్పాటు చేసిన జనరేటర్ల నుంచి వచ్చే శబ్దాలు చుట్టుప్రక్కల వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రొయ్యల గుంటల నుంచి వచ్చే వ్యర్థ జలాల కారణంగా, దుర్వాసనతో సతమతమైపోతున్నారు. అధికారులు తాము పడే ఇబ్బందులను గమనించి ఇళ్ల మధ్య వెళ్లే విద్యుత్ లైన్లను తొలగించాలని, రొయ్యల గుంటల నుంచి వచ్చే కాలుష్యాన్ని అరికట్టాలని, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకటగిరిలో ఆగని సమైక్య దీక్షలు!

అలసటలేని ఐక్య కార్యాచరణ సమితి

సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్న ఎన్జీఓలు సమ్మె విరమించి విధుల్లో చేరినా వెంకటగిరిలో మాత్రం ఐక్య కార్యాచరణ సమితి నేతృత్వంలో సమైక్యాంధ్ర ఉద్యమం కొనసాగుతూనే వుంది. పట్టణంలోని కాశీపేట సెంటర్‌లో వైకాపా ఆధ్వర్యంలో రిలే దీక్షలను చేపట్టారు. రోజూ వినూత్న కార్యక్రమాలతో నిరసన తెలుపుతూ సమైక్య వాదాన్ని విన్పించడంతోపాటు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, కాంగ్రెస్ పెద్దల వైఖరిని నిశితంగా ఎండగడుతున్నారు. ఉద్యోగులు సమ్మె విరమించినా, ప్రజలతో కలసి రాష్ట్రం సమైక్యంగా వుండాలని కోరుతూ ఉద్యమం కొనసాగిస్తూ వున్నారు. ఈ దీక్షల్లో ఐకాస నేతలు రమణారెడ్డి, రమాకాంత్, రత్నాకర్‌రెడ్డి, మంగళపూడి వెంకటేశ్వర్లు, రంగయ్యస్వామి, వెంకురెడ్డి, రాజభూషణ్, పరశురాం, రామారావు, సురేష్, రాధ తదితరులు పాల్గొన్నారు.



సమైక్యాంధ్రకు మద్దతుగా నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డి బృందం.

కొండాపురంలో పింఛనుదారుల ఇక్కట్లు!

● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

కొండాపురంలో పింఛన్ల పంపిణీపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ప్రభుత్వం ప్రతినెలా అందించే పింఛన్లను సక్రమంగా అందజేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ మీద ఆధారపడి జీవిస్తున్న పలువురు పేదలు సిబ్బంది కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు న్యాయంగా ప్రభుత్వం అందించే పింఛన్లను అందజేయకుండా రోజూ కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారని వృద్ధులు, వికలాంగులు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు. ఎందుకు ఇట్లా తిప్పుకొంటున్నారని ప్రశ్నిస్తే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఈసడించుకొంటున్నారని వాపోతున్నారు. గట్టిగా మాట్లాడితే మీకు పింఛన్లు రావు, వెనక్కు పంపేశామని బెదరిస్తున్నారని తెలిపారు. మూడు నెలలపాటు పింఛను తీసుకోకపోతే వారిని అనర్హులుగా ప్రకటించి జాబితా నుంచి తొలగిస్తారని ఆందోళన చెందుతున్నారు. పింఛనుపై జీవిస్తున్న వారు అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు సంబంధించిన సొమ్మును చెల్లించకుండా తిప్పుకొంటున్నారని పలువురు కూలీలు వాపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి సక్రమంగా పింఛను అందేలా చూడాలని, ఉపాధి సొమ్ము ఇప్పించాలని లబ్ధిదారులు కోరుకొంటున్నారు.

అన్నారెడ్డిపాళెంలో ఉచిత వైద్య శిబిరం

విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెంలో ఇటీవల ఉచిత వైద్య శిబిరం జరిగింది. వివిధ రోగాలతో ప్రజలు పడుతున్న బాధలను గుర్తించిన మన వూరు సేవా ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని తల పెట్టింది. స్థానికంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో న్యూ నెల్లూరు ఆస్పత్రి వైద్యులు పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అన్నారెడ్డిపాళెం గ్రామస్తులతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు వైద్య శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకొని డాక్టర్ల సూచనలు సలహాలు పొందారు. ఈ శిబిరంలో సాధారణ జబ్బులతోపాటు కంటి పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ భక్తవత్సలం, డాక్టర్ జగదీశ్వరి, సేవా ట్రస్ట్ ప్రతినిధులు వేణు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటగిరిలో

ఆనకట్టలు దెబ్బతిన్నాయి!

మరమ్మత్తు లెప్పుడు?

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో గల పలు ఆనకట్టలు దెబ్బతిని వుండడం మరమ్మత్తులకు నోచుకోకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. వర్షపు నీటితో సాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ ఆనకట్టలు ఎంతగానో ఉపయోగకరంగా వుంటాయి. వీటితోపాటు నీరు – మీరు కార్యక్రమం పేరుతో కొన్నాళ్ల క్రిందట వెంకటగిరి ప్రాంతంలో మన్నేగుంట, అక్బర్ నివాస కండ్రిగ, మామిడి కాలువ, చెలికంపాడు దగ్గర చెక్ డ్యాంలను నిర్మించారు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు సాయిగంగ కాలువ ఎంతగానో దోహదపడుతుంది. డక్కిలి మండలం అలపనేరు ఆనకట్ట, చెలికంతోపు, కోట మామిళ్ల ఆనకట్టలు, గొడ్డేరుపై నిర్మించిన ఆనకట్టల ద్వారా రైతాంగం పంటల సాగు చేసుకొంటోంది. అయితే ఈ ఆనకట్టలు దెబ్బతినడంతో రైతులు మరమ్మత్తు చేయించాలని అధికారులను కోరుతున్నా ఫలితం లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల రివిట్‌మెంట్‌లు దెబ్బతిన్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకపోయారు. అలాగే వెలిగొండ నుంచి వచ్చే వర్షపు నీరు పలు వాగుల ద్వారా వృధాగా వెళుతోంది. దీనిని దృష్టిలో వుంచుకొని కైవల్యానదిపై పట్టణ పరివాహక ప్రాంతంలో కూడా చెక్‌డ్యాంలు నిర్మిస్తే సాగునీటి తోపాటు తాగునీటి కొరత తీరుతుందని ప్రజలు కోరుకొంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే రామకృష్ణ రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు పలు ప్రాంతాల్లోని ఆనకట్టలను తనిఖీ చేశారు. చిన్న చిన్న మరమ్మతులను తక్షణం పూర్తిచేసి సాగునీటి నిల్వకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

● ముదిరిన శిలాఫలకాల

విధ్వంస వ్యవహారం!

పొదలకూరులో కాంగ్రెస్ X వైకాపా


సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా పొదలకూరులో చోటుచేసుకున్న శిలాఫలకాల విధ్వంసం వ్యవహారం రాజకీయ రంగు పులుముకొంటోంది. అధికార కాంగ్రెస్ పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పరస్పర ఆరోపణలకు దిగుతున్నారు. శిలాఫలకాల విధ్వంసం వ్యవహారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆ పార్టీ నేతలు స్టేషన్ల వద్దకు చేరుకొని తమ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారంటూ ఆరోపించడం తోపాటు అధికార కాంగ్రెస్ పార్టీ నేతల మాటలకు తలొగ్గారంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. వైకాపా ఆరోపణలకు కాంగ్రెస్ పార్టీ వారు ప్రత్యారోపణలు చేశారు. శిలాఫలకాలను ధ్వంసం చేసినవారిని గుర్తించి పోలీసులు అరెస్టు చేసినా తామే బాధ్యులమని అనడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికైనా వైకాపా తీరు మార్చుకొని రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని అడ్డుకొన్న గ్రామస్తులు!

ముదివర్తివాసుల నిరసన

సక్రమంగా గ్యాస్ సరఫరా చేయకుండా నెలల తరబడి తిప్పుకొంటుండడంపై విసిగివేసారిన విడవలూరు మండలం ముదివర్తి వాసులు గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులను అడ్డుకొని నిరసన తెలిపారు. కోవూరు ఏజన్సీ నుంచి మండల పరిధిలోని పలు గ్రామాల్లో గ్యాస్ వినియోగదారులకు సిలిండర్లు సరఫరా జరుగుతుంటుంది. అయితే గత కొన్ని నెలలుగా సిలిండర్ల సరఫరా అస్తవ్యస్తంగా మారింది. సిలిండర్ బుక్ చేసి మూడు నాలుగు నెలలు గడుస్తున్నా సరఫరా జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. దీనిపై పలుమార్లు ఏజన్సీ నిర్వాహకులను ప్రశ్నించినా సరైన సమాధానం రాకపోవడంతో ముదివర్తి గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ ఏజన్సీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని, బ్లాక్‌లో సిలిండర్లు అమ్ముకొంటూ గ్యాస్ వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయంటూ ఆరోపించారు. దీనికి నిరసనగా మండల పరిధిలో తిరుగుతున్న గ్యాస్ సిలిండర్ల వాహనాలను అడ్డుకొని వాదనకు దిగారు. దీనికి సిబ్బంది స్పందిస్తూ నిర్వాహకులతో మాట్లాడాలని చెప్పడంతో శాంతించిన నిరసనకారులు వాహనాలను వెళ్లనిచ్చారు.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190



శివకేశవులకు ప్రీతికరం కార్తీక మాసం!



శివకేశవులిద్దరికీ ప్రీతికరమైన మాసం కార్తీక మాసం. పాపాలను పటాపంచలు చేసి పుణ్యాన్ని ప్రసాదించే మాసంగా కార్తీక మాసాన్ని చెబుతారు. చాంద్రమానం ప్రకారం ఎనిమిదవది, శరదృతువులో రెండవది ఇది. కృత్తికా నక్షత్ర సమీపంలో చంద్రుడు సంచరించడం వలన ఈ నెలకు కార్తీక మాసమని పేరు వచ్చినప్పటికీ అన్ని మాసాలలో కెల్లా ప్రాధాన్యతను సంతరించుకొన్న మాసంగా దీన్ని చెప్తారు. దీపావళి వెళ్లిన మరుసటి రోజు నుంచి ప్రతి ఏడాది కార్తీక మాసం ఆరంభమవుతుంది. జపతపాలకు, నోములకు, వ్రతాలకు ఈ మాసంలో ఎంతో విశేషం వుంది. పురాణ కాలం నుంచి కార్తీకానికి ఒక ప్రత్యేకత, విశిష్టం వున్నాయి.

కార్తీక మాసం అనగానే స్నానాలు, దీపారాధన, వ్రతాలు, నోములు, అభిషేకాలు గుర్తుకు వస్తాయి. పరమేశ్వరుడికి ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసంలో శ్రీవిష్ణుమూర్తినీ ఆరాధిస్తారు. హరిహరాదులిద్దరికీ కార్తీక మాసంపై ఇష్టం వుండడం వారిరువురు వేరుకాదని ఒకటేనని తెలియజెప్పే మాసం కార్తీక మాసం. ఈ మాసంలో చేసే నోములు, స్నానాలు, దీపారాధన మాసం యొక్క విశిష్టతల గురించి స్కంద పురాణంలో విపులంగా చెప్పబడి వుంది. కార్తీక మాసంలో వచ్చే అన్నీ రోజులు పుణ్యప్రదమైనవే అయినా సోమవారాలకు ఒక ప్రత్యేకత వుంది. కార్తీక సోమవారాలుగా పిలువబడే ఆ రోజులో సోమవార వ్రతాలు ఆచరిస్తారు మహిళలు. అలాగే ఆలయాల్లో దీపాలు వెలిగిస్తారు. వీటిని కార్తీక దీపాలంటారు. కార్తీక సోమవారాలతోపాటు ఈ మాసంలో వచ్చే ద్వాదశి, చతుర్దశి, పౌర్ణమి రోజులకు ఎంతో ప్రాధాన్యత వుంది. పౌర్ణమి నాడు సాయంత్రం తులసి చెట్టుకు పూజ చేస్తారు. లక్ష్మీదేవి కొలువై వుండే తులసి చెట్టు ముందు దీపం వెలిగించి తమలపాకులో రాగి నాణెం వుంచి కుంకుమ చందనాలతో అలంకరించి చంద్రుడిని పూజించడం వలన కడుపు చల్లగా వుండి వారి సంతానం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో విలసిల్లుతుందని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాసం ఆరంభం నుంచి గృహాల్లో ద్వారబంధాల వద్ద ఇరువైపులా సాయంత్రం వేళ దీపాలను వెలిగించి వుంచుతారు. దీని వలన అపమృత్యువును నివారించబడతారని పురాణ వర్ణన. అలాగే ఆలయాల్లో కుండల్లో దీపాలను వెలిగించి కడతారు. వీటికి ఆకాశ దీపాలని పేరు. నదుల్లోను దీపాలను వెలిగించి అరటి బెరడుపై పెట్టి వదలుతారు. ఇక నదులు, సముద్రాల్లో ఈ మాసంలో చేసే స్నానాలకు విశేషం వుంది. కార్తీక స్నానాలుగా చెప్పబడే వీటిని చేయడం వలన మానసిక ప్రశాంతత లభించడంతోపాటు పుణ్యం కల్గుతుందంటారు. కార్తీక మాసంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి వనభోజనాలు చేస్తారు. ఎన్నో విశేషాలను, మరెంతో ప్రాధాన్యతను కల్గిన కార్తీక మాసానికి సమానమైన మాసం, విష్ణువుకు సమానమైన దైవం, వేదాలతో సమానమైన శాస్త్రాలు, గంగతో సమానమైన తీర్థం లేదని స్కంద పురాణంలో చెప్ప బడింది.

- రామనారాయణ

ఆకట్టుకొన్న కార్యక్రమాలు

స్వరనీరాజనానికి నెల్లూరీయుల పరవశం!

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అద్భుతంగా జరిగిన శివమణి డ్రమ్స్ విన్యాసాలు, బాలు బృందం పాట కచ్చేరి.

నెల్లూరులో పుట్టి పెరిగి నేపథ్యగాయకునిగా అసేతు హిమాచలమంత ఎత్తుకు ఎదిగిన పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వర నీరాజనం వినే భాగ్యాన్ని నెల్లూరీయులకు కల్పించారు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. కనుపర్తిపాడులో ఆయన ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబరు 24తేది సాయంత్రం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఆయన సోదరీమణులు వసంత, శైలజ, కుమారుడు చరణ్, అన్నకుమారుడు అభిషేక్, వర్ధమాన గాయకులు హరిణి, ప్రవీణ్‌లతో కలసి మూడు గంటలపాటు జనం మెచ్చే పాటలను పాడారు. ఈ కార్యక్రమానికి నెల్లూరీయులు తీరిక చేసుకొని వేలాదిగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కష్టపడి సంపాదించిన డబ్బును వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వ కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ అంతర్జాతీయ స్థాయిలో వుందని, దీన్ని అందరూ వాడుకోను ఇస్తానని ప్రభాకర్‌రెడ్డి చెప్పడం ఆయన మంచితనానికి నిదర్శనమన్నారు. అనంతరం శ్రీరామరాజ్యంలోని జగదానంద కారక పాటతో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తన సోదరి శైలజతో కలసి కచ్చేరి ప్రారంభించారు. సీతాకోక చిలుక చిత్రంలో మాటే మంత్రం, అన్నమయ్య చిత్రంలోని పురుషోత్తమా, స్వాతిముత్యం చిత్రంలోని సువ్వీ సువ్వీ, గీతాంజలి చిత్రంలోని ఆమని పాడవే, కొండవీటి సింహంలోని ఈ మధుమాసంలో, జగదేకవీరుడు అతిలోక సుందరి చిత్రంలోని ప్రియతమా, శ్రీరామదాసు చిత్రంలోని అంతా రామ మయం, సాగర సంగమంలోని వేదం పాటలను అత్యద్భుతంగా పాడి శ్రోతలను రంజింపజేశారు. గాయకునిగా తన ప్రస్థానానికి సహకరించిన తబలిస్ట్ రమణయ్య, జర్నలిస్ట్ గౌస్‌బాషను సైతం వేదికపై బాల సుబ్రహ్మణ్యం తలచుకొన్నారు. తాను నెల్లూరు దండువారివీధిలో నివసించే వాడినని తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి, తల్లి చేసిన పుణ్యం వల్లే తనకీ స్థాయి వచ్చిందన్నారు. గాయకులందరినీ స్వర నీరాజనం ప్రారంభానికి ముందే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సన్మానించారు. జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం, ఎజెసి పెంచలరెడ్డి చివరి వరకు కూర్చొని ఈ కార్యక్రమాన్ని ఆస్వాదించారు.

23తేది సాయంత్రం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సుప్రసిద్ధ డ్రమ్స్ మాస్టర్ శివమణి సుమధుర సంగీత లహరి కూడా నెల్లూరీయులను ఆకట్టుకొంది. ఈ సందర్భంగా శివమణి మాట్లాడుతూ తన పూర్వీకులది కూడా నెల్లూరేనన్నారు. రైల్లో చెన్నైకు వెళ్తూ నెల్లూరునుచూసి పులకించిపోయేవాడినన్నారు. చాలారోజుల తర్వాత నెల్లూరులో ప్రదర్శన చేసే అవకాశం వచ్చిందని, దీన్ని చూడను తన మేనమామ సూళ్లూరుపేట నుంచి ప్రత్యేకంగా వచ్చారని సభికులకు పరిచయం చేశారు. పాడుతా తీయగా ఫేం తేజస్విని, శివ, పరమేశ్వర్, షణ్ముఖప్రియ, సుదీప్‌ల సంగీత విభావరిని కూడా శ్రోతలు బాగా ఆస్వాదించారు. నెల్లూరులో రెండు అద్భుత కార్యక్రమాలను నెల్లూరీయులు కుటుంబ సమేతంగా వెళ్లి చూసే అవకాశాన్ని కల్పించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభినందనీయుడు.





సణుగుడు

* భూఆక్రమణలకు మితం లేదా?

డోలేంద్ర

నెల్లూరు నగరం భూ ఆక్రమణ దారుల పాలిట స్వర్గ ధామంగా మారుతున్నది. ప్రభుత్వ స్థలం కన్పిస్తే చాలు – రాత్రికి రాత్రి పాగా వేసేస్తున్నారు. కళ్ల మూసి తెరిచే లోగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేస్తున్నారు. అంతా బహిరంగ రహస్యమే.

ఫత్తేఖాన్‌పేట కూడలిలో రైతు బజారును ఆనుకొని ఇరిగేషన్ కాలువ ఒకటి వుంది. ట్రంకురోడ్డు మీద దానికొక కల్వర్ట్ కూడా వుంది. స్థానిక మునిసిపల్ కార్పొరేటర్ పిండి సురేష్ ఆ కాలువను కొంత ఆక్రమించి మూడంతస్తుల భవంతి నిర్మిస్తున్నాడు. రోడ్డు మీద వెళ్లే వారందరికీ కొట్టొచ్చినట్లు కన్పించే దురాక్రమణ ఇది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్, తహశీల్దారు వంటి అధికారులందరూ ఈ రోడ్డు మీద రోజుకు మూడు నాలుగు సార్లయినా వెళ్తూనే వుంటారు. వూరిలోని జనమంతటికీ కన్పిస్తున్న ఆ భవన నిర్మాణం ఈ అధికారులకు మాత్రం కన్పించడం లేదు. వారు అంత గుడ్డి వారైపోయారు. నగరంలోని అత్యంత ఖరీదైన కూడళ్లలో ఇదొకటి. అంకణం పది లక్షల వరకు ధర పలుకుతున్న దక్కడ. మెయిన్‌రోడ్డు ఫేసింగ్ అంటే మరింత జాస్తి విలువ. దాదాపు ఐదు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఒక చోటా రాజకీయవాది బహిరంగంగా, నిర్భయంగా ఆక్రమించి, ఏ అనుమతులూ లేకుండా అంత పెద్ద భవంతి నిర్మిస్తుంటే అడిగేవాడు లేడు; అడ్డగించే వాడు లేడు.

జిల్లా మీద సంపూర్ణ రాజకీయ నిరంకుశత్వం చలాయించుకొంటున్న ఆనం సోదరుల అడుగులకు మడుగులొత్తితే చాలు, ఏ పాడు పనైనా నిక్షేపంగా జరిపించుకోవచ్చుననే నానుడి ఏర్పడిపోయి వుంది ఇప్పుడు. చవకబారు క్రైం సినిమాలో చూపించే విలన్ల మాదిరి మారిపోయారు ఆనం రామనారాయణ రెడ్డి, వివేకానందరెడ్డిలిద్దరూ. వారిని ధన పిశాచి ఏదో ఆవహించినట్లుంది. ఎంత సంపాదనా చాలుతున్నట్లు కన్పించడం లేదు. స్వంతం అని చెప్పుకోవడానికి డొక్కు సైకిల్ కూడా లేని స్థితిలో ఎమ్మెల్యే అయ్యాడు వివేకానందరెడ్డి. అరువు కారుకు పెట్రోల్ పోసేవాడు దొరకక అవస్థలు పడిన రోజులు చూసిన వారు చాలామందే బ్రతికి వున్నారు. కానీ ఇప్పుడదే వివేకానందరెడ్డి అపర కుబేరుడు. ఆయన దగ్గరున్న విలాసవంతమైన కార్ల విలువే కోట్లలో వుంది. నెల్లూరు, హైదరాబాద్, బెంగుళూరు నగరాలలో అన్నా, తమ్ముడు కొన్న, కొంటున్న ఆస్తుల గురించి నగరంలో కథలు కథలుగా చెప్పుకొంటున్నారు.

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేయదు కదా? తమ నేతలు రాజకీయాన్ని అడ్డం పెట్టుకొని అడ్డదుడ్డంగా సంపాదించుకోవడాన్ని కళ్లార చూస్తున్న అనుచరులూ అదే దారిలో నడుస్తున్నారు. వారికి తెలిసిన విద్య – భూ ఆక్రమణ. ఆనం అనుచరుల పేరుతో దాదాపు రెండుమూడు డజన్ల మంది రాబందుల వలె వాలిపోయి వున్నారు నెల్లూరులో. దొంగలు దొంగలు వూళ్లు పంచుకొన్నట్లు నగరంలో ప్రాంతాల వారీగా తమ భూ బకాసురత్వాన్ని పంపకం చేసుకొన్నారేమో అన్పిస్తున్నది.

దర్గామిట్ట ప్రాంతంలో ఆనం వారి ఐదవ తమ్ముడనని చెప్పుకొని, సకల సబ్బండు భ్రష్టత్వాలకు పాల్పడుతున్న నూనె మిల్లు పెంచలరెడ్డి ఇందుకొక వికృతమైన ఉదాహరణ. వంద కోట్ల విలువ చేసే వేదాయపాళెం బాలయోగీశ్వర మఠం స్థలాన్ని వుట్ట వుడియంగా దిగమ్రింగేసిన ఘనుడు. అంత ఖరీదైన ప్రభుత్వ ఆస్తిని స్వాహా చేస్తేనే అడ్డుకొన్నవాడు లేనప్పుడు ఇక తనకు ఎదురే ముందనే ధీమాతో వ్యవహరిస్తున్నాడు. వేదాయపాళెంలోనే హౌసింగ్ బోర్డుకు చెందిన విశాలమైన స్థలం ఒకటి వుంది. చాలాకాలం నుంచి ఖాళీగా వుంది. దాని మీద కన్ను పడింది పెంచలరెడ్డికి. ఇంకేముంది – తహశీల్దారును బెదరించి, భయపెట్టి, 9 అంకణాల లెక్కన తన బంధువుల పేరుతో పట్టాలు సృష్టించాడు. పత్రికలలో వార్తలు రాకుండా ఏసిఎన్ కేబుల్ టీవీ, ఆంధ్రజ్యోతి, సాక్షి వంటి

కొరవ 14వ పేజీలో

ఆర్టికల్ 371 డి రాష్ట్ర విభజనకు అడ్డంకి కాబోదు!

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 డి పెద్ద అవరోధమని, దాని ప్రకారం విభజన వీలుకాదని సమైక్య ఆంధ్ర నేతలు వాదిస్తున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కూడా ఆర్టికల్ 371 డిని రద్దు చేయడమో, లేదా సవరించడమో జరగాలని సిఫార్సు చేసింది. ఇంతకూ ఈ ఆర్టికల్ 371 డి అంటే ఏమిటి అన్నది ప్రశ్న.

1952లో ఆంధ్ర రాష్ట్రం మద్రాసు నుంచి విడిపోయినప్పుడు తెలంగాణ ప్రాంతం విడిగా వుంది. హైదరాబాద్ స్టేట్ పేరుతో అదొక ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగుతూ వుండింది. వారికొక ముఖ్య మంత్రి, శాసనసభ, సెక్రటరియేట్ వంటివన్నీ వున్నాయి. కానీ ఆనాటికి ఆంధ్ర రాష్ట్రం ఆర్థిక పరిస్థితి కడు దీనం. ప్రభుత్వ రాబడి జీతనాతాలకు కూడా చాలేది కాదు. ఆనాడు ముఖ్యమంత్రిగా వుండిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి తన కార్యాలయానికి ఒక చిన్న భవనం కట్టుకోవాలని ఎంత ప్రయత్నం చేసినా డబ్బు సమకూరలేదు. మూడేళ్లపాటు ఆంధ్ర రాష్ట్ర రాజధాని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడారాలలో, పూరిపాకలలో నడిపారు. మంత్రుల ఇళ్లు కూడా గుడారాలే. బాత్‌రూంలు సైతం వుండేవి కావు. ఆరుబయట బహిరంగ ప్రదేశాలలో కాలకృత్యాలు తీర్చుకొనే వారు. ఆ దయనీయ పేదరికం నుంచి, ఆంధ్రరాష్ట్రాన్ని రక్షించాలంటే తెలంగాణను తమలో కలుపుకోవడం ఒక్కటే మార్గమని భావించారు. జవహర్‌లాల్ నెహ్రూ కూడా అదే అభిప్రాయపడ్డారు. లేకుంటే ఆంధ్రకు కొత్త రాజధాని కట్టడానికి కేంద్రం నుంచి నిధులు ఇవ్వాలి. అవి నెహ్రూ వద్ద కూడా లేవు. దానితో ఆనాటి తెలంగాణ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావును ఒప్పించి, విలీనానికి సమ్మతింప చేశారు. అయితే ఆ నిర్ణయం తెలంగాణ వాదులకు ఇష్టం లేదు. వారు తీవ్ర స్థాయిలో అభ్యంతరం చెప్పారు. మెజార్టీ ప్రజలు విలీనానికి ఒప్పుకోలేదు.

అప్పట్లో చదువుకొన్న వారికి ఉద్యోగం అంటే ప్రభుత్వ నౌకరీ మాత్రమే. వేరే ఉపాధి అవకాశాలు వుండేవి కావు. తెలంగాణ వాదులు విలీనానికి ప్రధానంగా వ్యక్తం చేసిన అభ్యంతరం – హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన వారిని పక్కనపెట్టి ఆంధ్ర నుంచి వలస వచ్చేవారు ప్రభుత్వ ఉద్యోగాలను తన్నుకపోతారని. వారిలో ఈ భయం తొలగించడం కోసం చేసిన ప్రయత్నంలో ఒక భాగమే ఆర్టికల్ 371–డి.

1949లో కాన్‌స్టిట్యూయంట్ అసెంబ్లీ చర్చల లోనే రాష్ట్రాల విభజన వల్ల తలెత్తే ప్రాంతీయ అసమానతలు, ఒక ప్రాంతానికి లాభం, వేరొక ప్రాంతానికి నష్టం జరగడం వంటి సమస్యలు చర్చకు వచ్చాయి. మహారాష్ట్ర నుంచి గుజరాత్‌ను విడదీయడంలో మొదటిసారిగా ఈ వివాదం తలెత్తింది. దాని పరిష్కారం కోసం 1949లోనే, రాజ్యాంగంలో ఆర్టికల్ 371 అధికారాన్ని చేర్చారు. దాని ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగాలు, విద్యావకాశాలు సమంగా పంపిణీ కావాలని, ఉభయ రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధి మండలులు ఏర్పడాలని నిర్దేశించారు. ఆ తర్వాత కొత్తగా ఏ రాష్ట్రం ఏర్పడినా ఇదే రాజ్యాంగ అధికారాన్ని వర్తింప చేస్తూ వచ్చారు. ఆ క్రమంలోనే ఆంధ్ర, తెలంగాణ విలీనం కోసం 371 క్లాజ్ 1 అనే రాజ్యాంగ అధికరణం ప్రవేశ పెట్టారు. దాని ఆధారంగా ఇటు పక్క బెజవాడ గోపాలరెడ్డి, అటు పక్క బూర్గుల రామకృష్ణా రావుల నాయకత్వంలో ఒక పెద్ద మనుషుల ఒప్పందం చేసుకొన్నారు. దానికి కొనసాగింపుగా పబ్లిక్ ఎంప్లాయిమెంట్ రిక్వయిర్‌మెంట్ యాజ్ టు ది రెసిడెన్స్ యాక్ట్ అనే చట్టాన్ని 1957లో పార్లమెంట్ ద్వారా చేయించారు. అయితే ఈ చట్టంలో తెలంగాణకు ఇచ్చిన ప్రత్యేక వసతి చాలీ చాలన్నట్లుగా వుందని, నిజాం హయాంలో ప్రవేశపెట్టిన ముల్కీ రూల్స్ మాత్రమే చట్టబద్ధమైనవని సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పు చెప్పింది. దీని ప్రభావంతోనే తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాలు నడిచాయి. చాలా సంవత్సరాలపాటు రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి ప్రధాని ఇందిరమ్మ ఇరు ప్రాంతాల వారిని సంతృప్తి పరచడానికి 1973 సెప్టెంబర్ 21తేది, ఆరు సూత్రాల పథకం ప్రకటించారు. దీనికి చట్టబద్ధత కల్పించడం కోసం రాజ్యాంగం 32వ సవరణ జరిపారు. ఆ సవరణ ప్రకారం మొదట చేసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 క్లాజ్–1 రద్దయ్యి, ఆర్టికల్ 371–డి ఆచరణలోకి వచ్చింది.

ఆ అధికారం ప్రకారం అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారీగా కేటాయించి, వాటిని ఆయా ప్రాంతాల స్థానిక పోస్టులుగా గుర్తించాలి. ఈ నిబంధన వల్లనే మన రాష్ట్రంలో బదలీలను జోన్ల వారీగా జరుపుతున్నారు. అందుకోసం స్థానిక ప్రాంతాలు అంటే ఏమిటో నిర్వచించాలి.

ప్రభుత్వ నిర్వహణలోని విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుంది.

రిజర్వేషన్లకు కూడా జోన్ల ప్రాతిపదిక పాటించాలి.

ఈ నిబంధనల పాటింపులో పేచీలొస్తే పరిష్కరించడానికి రాష్ట్రపతి ఒక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి.

అందరు ఉద్యోగుల సర్వీసు సీనియారిటీకి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది.

అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌కు ఉద్యోగుల విజ్ఞప్తులను స్వీకరించి, తగువైన ఆదేశాలిచ్చే అధికారం వుంటుంది. ఆ ఉత్తర్వులను ప్రభుత్వం మూడు నెలల లోపల పాటించాలి. లేదంటే ఈలోగా ఆ ఉత్తర్వులను శాసనసభ అనుమతితో సవరించడం, లేదా పూర్తిగా రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి వుంది.

అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చే ఉత్తర్వుల మీద రాష్ట్ర హైకోర్టుకు ఎటువంటి జోక్యం వుండదు. సుప్రీంకోర్టుకు మాత్రమే అధికారం వుంటుంది. ఏ కారణం వల్లనైనా అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వద్దు అనుకొంటే, దాన్ని రద్దు చేసే అధికారం ఒక్క రాష్ట్రపతికి మాత్రమే వుంటుంది.

రాష్ట్ర విలీనం జరిగిన 1956 నవంబర్ 1తేది లోపు పూర్వపు తెలంగాణ రాష్ట్రమైన హైదరాబాద్ స్టేట్ ప్రభుత్వం చేసిన ఉద్యోగుల నియామకం, బదలీ, ప్రమోషన్ వంటి వాటిని రద్దు చేసే అధికారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి వుండదు.

ఇవీ ఆర్టికల్ 371 డిలోని విశేషాలు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరగాలంటే ఈ అధికారం ప్రకారం వీలు కాదని సమైక్యవాదుల వాదన. కానీ వారి వాదనలో పస లేదు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తికి మూలం ఈ అధికరణం కాదు. దాన్ని జరిపించింది రాజ్యాంగం 32వ సవరణ. రాజ్యాంగంలో ఒకసారి చేసిన సవరణను మరొకసారి రద్దు చేయడానికి, మళ్లీ సవరించడానికి పార్లమెంట్‌కు అధికారం వుంది. అందుకు తగిన మెజార్టీ వుంటే చాలు. తెలంగాణ విభజనను బిజెపి కూడా సమర్థిస్తున్నది కాబట్టి, ఇతర ప్రాంతీయ పార్టీలు ఎట్లా పోయినా బిజెపి, కాంగ్రెస్‌లు కలిస్తే రాజ్యాంగ సవరణకు అవసరమైన మెజార్టీ సరిపోతుంది. అందువల్ల రాష్ట్ర విభజనకు ఇది పెద్ద అడ్డంకి కాదు.

జ్యోతిష శాస్త్ర సంహితాస్కంధంలో వాస్తు శాస్త్రం విభాగం! విషయం అవిభాజ్యం!!

డాక్టర్ సి.మహీధర్ హైదరాబాద్

** వాస్తు శాస్త్రం ఏ శాస్త్రం నుంచి ఆవిర్భవించింది?*

వాస్తు శాస్త్రానికి మాతృమూర్తి జ్యోతిష శాస్త్రం. 'లగధ మహర్షి' ఆద్యుడుగా చెప్పబడుతున్న జ్యోతిష్య సంహితా స్కంధంలో వాస్తు శాస్త్రం ఓ విభాగం. అది జ్యోతిష శాస్త్రం నుంచి పుట్టింది. దాదాపు ఇరవై ఎనిమిది మందికి పైగా, మహర్షులు జ్యోతిష, వాస్తు శాస్త్రాలను విస్తృత పరిచారు.

జె.ఆర్.రెడ్డి చెన్నై

** ధ్వజాయాన్ని నిర్ణయించి అలాగే నిర్మాణం చేయాలంటున్నారు?*

మీ స్థలం ఉత్తరం, యవర్గ గజాయం వస్తుంది. ధ్వజాయం తప్పు. వర్గును గురించి అతనె వరో తప్పుగా చెప్పాడు. అందువల్ల ప్లాను మార్చు కోండి.

డి.రవిశంకర్‌శాస్త్రి తిరుపతి

** నేను వాస్తు విద్యార్థిని. షోడశ పదం, దిగ్మూ ధం, శుద్ధ ప్రాచీన విధానాల్ని తెలుసుకోవాలి.*

మీరు 'వాస్తు శాస్త్ర వివేకం', మయ వాస్తు గ్రంథాల్ని చదవండి.

డాక్టర్ రమేష్‌జోత్స్న చెన్నై

** 'గర్భ స్థాపన'ను గురించి వివరించండి?*

పంచ మృత్తిక, మూలాలు, లోహములు, సప్త ధాతు, నవరత్న, త్రివిధ ఔషధాలు రాగి పాత్రలో వుంచి మంత్ర యుక్తంగా స్థాపించడాన్ని మయ మత శాస్త్రం 'గర్భస్థాపన' అని వివరణ ఇస్తున్నది.

టి.వెంకటేశం నాయుడుపేట

** వ్యాధి రోజురోజుకూ పెరుగుతుంది. పొర్లుదండాలు రోజుకు నూట ఎనిమిది చేయమం టున్నారు.*

ఆరోగ్యంగా వుంటే ఛాందసుల్ని నమ్మి ఛాం దసాల్ని పాటించవచ్చు. ముందు డాక్టర్ని కలవండి. అనారోగ్యంతో బాధపడుతూ పొర్లు దండాలేమిటి? శాస్త్రం ఎప్పుడూ ఛాందసాల్ని ప్రోత్సహించదు.

ఆర్.బి.ఆర్ చిత్తూరు

** 'చేతబడి' వుందా? నాకేదో అనుమా నంగా వుంది?*

మీరు అనవసరంగా భయపడకండి. మంత్ర, తంత్ర సారస్వతంలో చేతబడి ప్రస్తావనలున్నాయి. అయితే అంత శక్తివంతులైన మాంత్రికులిప్పుడు లేరు. చేతబడి ఓ మానసిక సమస్య.

టి.వసంత గుప్త శ్రీకాళహస్తి

** మా ఊళ్లో ప్రతి ఇంట్లో ఒక సమస్య వుంది. 'గోపురం' సెంటిమెంటు వల్ల మా మనసు బాగోలేదు.*

ఆలయం చుట్టుప్రక్కల ఇళ్లకు గోపురం కూలిన తర్వాత ఆగమ శాస్త్రవేధో బాధలు ఎక్కు వయ్యాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గోపుర నిర్మా ణాన్ని త్వరగా పరిష్కరించుకోండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి

4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

షేక్ షకీల్‌అహ్మద్ హైదరాబాద్

** అయ్యా ఈ పదం తికమకలకు గురిచే స్తోంది. మయ మతంలో చదివాను. అది "ద్వాత్రిం శతి"?*

దీని అర్థం ముప్ఫయి రెండు అని. 'మయ మతం' ఏడవ అధ్యాయంలో ముప్పై రెండు వాస్తు పదాలను గురించి వివరణ ఇచ్చింది.

సి.సుజాతారెడ్డి అనంతపురం

** యంత్ర సారస్వతాన్ని గురించి చెప్పండి?*

'మత్స్య' తదితర పురాణాలలో యంత్ర సార స్వతం ఇమిడి ఉంది. ఇరవై ఎనిమిది యంత్రాలు వాటి అవసరం, ప్రతిష్ట, ఫలితాలను గురించి అం దులో స్పష్టంగా చెప్పబడింది.

పసుపుపర్తి శాంత నెల్లూరు

** మనిషి బలహీనతల్ని కొందరు వాడుకుం టున్నారేమో అనిపిస్తున్నది?*

అలాంటి వారు అన్ని వర్గాలలోనూ వున్నారు. జ్యోతిష, వాస్తు శాస్త్రజ్ఞుల్ని మాత్రమే తప్పు పట్టా లిసిన అవసరం లేదు. జీవికకు 'డబ్బు' అవసరం. అందువల్ల సంపాదించుకోవాలి. అయితే దురాశకు లోనై 'అశాస్త్రీయం'గా పూజలు పునస్కారాలని 'పడుపు కూడు' తినాల్సిన అవసరం లేదు. అలాంటి వారు శాస్త్రజ్ఞుల్లో కూడా ఎవరూ లేరు.

ఎన్.రమణారెడ్డి సికింద్రాబాద్

** కోడలు నెలల గర్భంతో వున్నది. శంకు స్థాపన చేయవచ్చా?*

ఈ పరిస్థితులలో శంకుస్థాపనను వాయిదా వేసుకోండి. మంచిది కాదు.

'ఆత్మకూరు' అంతరంగ చరిత్ర ఆవిష్కరణం; పరిశోధన సింహపురి సీమకు మణిభూషణం!

తెలుగు సాహిత్య చరిత్రలో పదలాలిత్యా నికీ, కావ్య ప్రసిద్ధతకూ పోతన తర్వాత చెప్పుకోదగ్గ విదుషీమణి ఆతుకూరు మొల్ల. ఆత్మ కూరు భ్రష్టరూపం ఆతుకూరు. ఈ ఇంటి పేరుగల మొల్లను గురించి పాతిక సంవత్సరాలకు పైగా పరి శోధన చేస్తూ క్రీ.శ 1240–47 ప్రాంతాల శివాల యం విశ్వనాధస్వామి శాసనాలు, అలఘునాధ స్వామి ఆలయ శాసనాలు (క్రీ.శ 1270–80) పరిశీ లించడానికి 1990–2010 మధ్య ప్రాంతంలో ఆరేడు పర్యాయాలు ఆత్మకూరులో పర్యటించిన సందర్భంలో ఆత్మకూరు, అనంతసాగరం చెరువు శాసనాలు, చరిత్ర విషయాలు ఎవరైనా గ్రంథస్తం చేస్తే బాగుండునని అనుకొనేవాడిని.

స్వర్గీయ వావింటపర్తి కృష్ణారావు అక్కడ రెవిన్యూ ఉద్యోగిగా పనిచేస్తూ ఆత్మకూరు మీద రెండు మంచి పుస్తకాలు రాశారు. అవి ఇప్పటి పరి శోధకులకు ఉపయోగపడుతున్నాయి. ఆత్మకూరు చుట్టుప్రక్కల, కొండ మీద చాలా చారిత్రక అవశేషా లున్నాయి. ఈ నేపథ్యంలో ఆత్మకూరువాసి శివుని చంద్రశేఖర్‌రెడ్డి అనే ఔత్సాహిక యువకుడు "ఆత్మ కూరు కైఫియతు" అను పేరుతో భావితరాలకు ఉపయోగపడే ఓ మంచి పుస్తకాన్ని తీసుకు వచ్చాడు. అతను నిజానికి చరిత్ర విద్యార్థి కాదు. పరిశోధ కుడు అసలే కాదు. కేవలం జన్మభూమి పట్ల వున్న అభిమానం, అతనిలో పొంగిపొరలుతున్న ఉత్సా హం ఈ పుస్తక ఆవిష్కరణకు కారణమై వుంటుం దని నేననుకుంటున్నాను.

ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. భారత దేశ చరిత్రకారులలో దాదాపు ఎనిమిది మంది సింహపురీయులే! వాళ్లు ఆత్మకూరు శాసనాలను గురించి అక్కడక్కడా ప్రస్తావించారు. అప్పుడెప్పుడో వచ్చిన రెండు, మూడు 'జమీన్‌రైతు' ప్రాచీన ప్రత్యేక సంచికలలో నెల్లూరు చరిత్రకు సంబంధించి చాలా అంశాలు ప్రస్తావించబడ్డాయి. సింహపురి మండల సరస్వంలో మరికొన్ని ప్రస్తావనలు వచ్చాయి.

కైఫీయతు అంటే గ్రామానికి సంబంధించిన సంపూర్ణ విషయాల్ని గుదిగుచ్చిన గ్రంథం అన్న మాట. బ్రిటీష్ కల్నల్ 'మెకంజీ' దయ వల్ల ఊరూ రికి ఇట్లాంటి కైఫీయతులు తయారయ్యాయి. గ్రామ కరణాలు, మునుసుబులు గ్రామానికి సంబంధిం చిన గ్రామ చరిత్రలు, శాసనాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అతి త్వరగా తయారు చేయాలని 'మెకంజీ' కఠినమైన ఉత్తర్వులు జారీ చేయకపోయి వుంటే "కైఫీయతు" తయారయ్యేవి కానే కావు.

రచయిత కైఫీయతు సంపాదించి అనేకానేక చారిత్రక అంశాలు, శాసనాలను పట్టుదలతో, కష్ట పడి సేకరించాడు. అంతేనా పావుభాగం కైఫీయతు లోని చారిత్రక అంశాలు చెప్పి మరొక ముప్పాతిక భాగం ఆధునిక సామాజిక అంశాలను చెప్పడానికి ప్రయత్నించాడు. యాభై, అరవై సంవత్సరాల క్రితం నాటి అంశాలు చెబుతూ వుంటే "మా కాలంలో ఇలాంటి పరిస్థితులు వుండేవి" అని రచ్చబండల మీది వృద్ధులు మీసాలు మెలివేసి గర్వంగా ముసి ముసి నవ్వులు నవ్వితే ఆహా అదా సంగతి అని నేటితరం శ్రద్ధగా ఆ చరిత్రను విని "మనకింత చరిత్ర" వుందా అని ఆశ్చర్యపోతున్నారు. రచయి తకు ఇంతకంటే తృప్తి ఏమి వుంటుంది.

చారిత్రక ఆధారాల గురించి ఒకవైపు వివ రిస్తూనే ప్రాచీన ఆత్మకూరు రహదారుల్ని గురించి వివరణ పూర్వకంగా విశ్లేషించాడు రచయిత. ఉదయగిరి, రాపూరు, నెల్లూరు మధ్య భాగంలోని ప్రాంతం క్రీ.శ 8, 9 శతాబ్దాల వరకు బోయల స్వాధీనంలో వున్న మాట వాస్తవం. ఇప్పటి మండ లాలకు వలె అప్పటి హద్దుల ప్రాంతాల్ని 'కొట్టాలు' అనేవారు. వీటిపై క్రీ.శ 12వ శతాబ్దంలో పండరం గడు దాడిచేసి 'కొట్టాలను' మసిచేసినట్లు శాసనా ధారాలున్నాయి.

పుస్తకసమీక్ష

ఆత్మకూరు కైఫీయతు

రచయిత : **శివుని చంద్రశేఖర్‌రెడ్డి**
సమీక్షకుడు: **పాయసం సుబ్రహ్మణ్య మహర్షి**
వెల: 100/– పేజీలు: 145
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు
ఫోన్: 8297127801

ఆత్మకూరులో విఖ్యాతమైన ఆలయాలు రెండు. ఒకటి అతి ప్రాచీనమైన విశ్వనాధుని ఆల యం క్రీ.శ 1180 – 1267కు చెందింది. ఈ శివా లయానికి ఒక కోనేరు, అలఘునాధ స్వామికి మరొక కోనేరు వుండేవి. విశ్వనాధుని ఆలయానికి సంబంధించిన మూడు శాసనాలు ఎపిగ్రఫికా ఇం డికాలో వివరణలున్నాయి. అలఘునాధస్వామి ఆలయ శాసనాలను గురించి 'చరిత్రగల ఆత్మ కూరు' పుస్తకంలో వివరణ వున్నది. ఆత్మకూరు లోని ఆలయాలు చోళుల కాలంలో ప్రారంభమై విజయనగర సామ్రాజ్యం వరకూ పరంపరాను గతంగా అభివృద్ధి చెందాయి. అందువల్ల రెండు రాజవంశాల శిల్ప, వాస్తురీతులు వాటిలో ప్రతి ఫలిస్తున్నాయి. చోళ వాస్తు రీతులలో గోపుర నిర్మా ణం ప్రత్యేకమైనది. భారతీయ 'వృషభం' శిరస్సును ఆదర్శంగా తీసుకుని ఈ నిర్మాణాలు కొనసాగిం చారు. అందువల్లే శిఖరం పై భాగంలో 'వృషభం' కొమ్ములలాంటి రెండు నిర్మాణాలు మధ్యలో కల శాలు కనిపిస్తాయి. ఈ గోపుర నిర్మాణంలో కూట, పంజర, శాల నిర్మాణాలు, దేవకోషలు వుంటాయి. గోపురం నిర్మాణంలో వివిధ దేవతా శిల్పాలతో పాటు, రతికేళి శిల్పాల్ని కూడా పొందు పరిచారు. ఈ రకమైనశైలీ విశ్వాసమే దారురధ నిర్మాణం లోనూ చోటుచేసుకున్నది.

అలఘునాధస్వామి ఆలయ శాసనాలలో ఒకటి ఆత్మకూరులోనూ, రెండవది ఆలయం లోనూ లభించినట్లు పురావస్తు శాఖ శాసన సంపు టలలో వున్నది. క్రీ.శ 1538–51కి చెందిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆత్మకూరులో పూజ లందుకొన్నట్లు స్థల చరిత్రలలో నేను చదివాను. ఈ పుస్తకంలో ప్రాచీన చరిత్రకు సంబంధించిన అంశాలు కొద్దిగా, టూకీగా వున్నవి. క్రీశ 1845 – 1960కి సంబంధించిన చాలా విషయాలు విపు లంగా వున్నవి. ఈ అంశాలు ఉప శీర్షికల క్రింద విభజించి రచయిత ఫోటోలతో సహా విశ్లేషిం చాడు. ఈ అంశాలు 1935 తర్వాత జన్మించిన వారికి పరిచయ అంశాలుగానూ, ఈ తరం వారికి సరిక్రొత్తవిగా కనిపించి చవులూరిస్తాయి. మంచి రచన చేసిన శివుని చంద్రశేఖర్‌రెడ్డి అభినందనీ యుడు.



నవంబర్ రెండవ వారంలో

నెల్లూరులో సిఎం రచ్చబండ!

- **జిల్లాలో సెప్టెంబర్ నెలలో జరగాల్సిన ముఖ్యమంత్రి రచ్చబండ కార్యక్రమం సమైక్యాంధ్ర ఆందోళన మూలంగా రద్దయ్యింది.**
- **రెండవ వారంలో ఈ కార్యక్రమం చేపట్టను జిల్లా అధికారులు సిద్ధమౌతున్నారు.**

సమైక్యాంధ్ర ఆందోళనల కారణంగా రెండు నెలలపాటు సంక్షేమ పథకాల అమలుకు బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాల నేతలు చర్చలు జరిపిన అనంతరం తాత్కాలికంగా సమ్మెను విరమించి విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించారు. సమ్మె జరిగిన రెండు నెలల్లో ప్రభుత్వ పరిపాలన పూర్తిగా స్తంభించి పోయి ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూసిన అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు రోజువారీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినా సంక్షేమ పథకాలపై దృష్టిసారించలేక పోతున్నారు. గతంలో మంజూరు చేసిన వాటికి సబ్సిడీ నిధులు నేటికీ విడుదల కాలేదని లబ్దిదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

సమైక్యాంధ్ర ఆందోళనలు తలెత్తకుంటే సిఎం సెప్టెంబర్ నెలలోనే మన జిల్లాలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించేవారు. ఇందుకు సంబంధించి అప్పట్లో ప్రకటన కూడా జారీ అయ్యింది. ఇప్పుడు అవకాశం రావడంతో నవంబర్ రెండవ వారంలో జిల్లాలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులకు సంతేకాలందాయి. ఈ సంవత్సరం ఏప్రెల్ నెలలో ఇందిరమ్మ బాట పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు సార్లు సిఎం జిల్లా పర్యటనకు వచ్చి సూళ్లూరుపేటలో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం ప్రారంభించిన సంగతి తెలిసిందే. రచ్చబండ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

సంక్షేమ పథకాల అమలులో భాగంగా నవంబర్ 14 నుంచి 7వ విడత భూ పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించే నాటికి బ్యాంకు అధికారులతో కూడా సమావేశం జరిపి రుణాల మంజూరు వేగవంతం చేయాలన్న ఆలోచనలో వున్నారు.

2013 – 14 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళిక రాష్ట్రస్థాయిలో ఆమోదం పొందినప్పటికీ జిల్లాలో అమలుకు నోచుకోలేదు. ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ శాఖలతోపాటు ఇందిర క్రాంతి పథం ఆధ్వర్యంలో పంపిణీ చేయాల్సిన పెన్షన్లు మంజూరుచేసి రచ్చబండ కార్యక్రమంలో సిఎం చేతులమీదుగా అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. కొత్తగా మంజూరైన పెన్షన్ల కోసం లబ్దిదారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరులోగా రచ్చబండ పర్యటన ఖరారుకు కసరత్తు పూర్తిచేసే అవకాశం వుందని అధికారులు అంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రచ్చబండ కార్యక్రమాన్ని మన జిల్లా మంత్రి సూచన మేరకు రెండవ వారంలో నిర్వహించే ఆలోచనలో వున్నట్లు అధికార యంత్రాంగం భావిస్తుంది. ఈ లోపల ఈ కార్యక్రమానికి కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమై వున్నారు. భూ పంపిణీ, రుణాల మంజూరు, వృద్యాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల అందజేత, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సిఎం చేతులమీదుగా జరిపించే అవకాశం వుంది.

◆

సాగు...తున్న పనులు

జిల్లాలో జలయజ్ఞం పనులు పూర్తయ్యేదెన్నడు?

జిల్లాలో నీటిపారుదల శాఖ నేతృత్వంలో జరుగుతున్న జలయజ్ఞం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పైస్థాయి నుంచి క్రిందిస్థాయి వరకు అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నందున కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతను పాటించడం లేదు.

జిల్లాలో జలయజ్ఞం పేరుతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేయించడంలో నీటి పారుదల శాఖ అధికారులు విఫలం చెందుతున్నారు. ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఈ పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి కాకుండానే అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల గడువును పొడిగించేందుకు సంబంధిత శాఖ అధికారులు బాగా సహకరిస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలు, కాలువల ఆధునీకరణ పూర్తికానందున ఆయకట్టు రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రతిసారీ నిర్వహించే సాగునీటి సలహా బోర్డు సమావేశంలో జలయజ్ఞం పనులకు సంబంధించిన సమాచారం అందించి ఆ తర్వాత పత్తాలేకుండా పోతుంటారు అధికారులు. జిల్లాలో 800 కోట్ల రూపాయలతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టు పనుల గురించి ప్రజాప్రతినిధులకే సమాచారం అందని పరిస్థితి. వీరు కూడా సభలు, సమావేశాల్లో తప్ప మిగతా రోజుల్లో పనుల పురోగతి విచారించే వారుండరు.

ప్యాకేజి నెం.1లో పెన్నాడెల్టా డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాలువల ఆధునీకరణ, సదరన్ ఛానల్ సిస్టం క్రింద 26 డిస్ట్రిబ్యూటరీ పనులు మంజూరయ్యాయి. ఈ పనులకు 321.32 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది ప్రభుత్వం. ఈ పనులను దక్కించుకున్న ఎపిఆర్ కన్‌స్ట్రక్షన్ – పివిఆర్ ప్రాజెక్టు 2011 మార్చి నాటికి పనులు పూర్తి చేయాల్సి వుంది. అయితే వివిధ సాంకేతిక కారణాలను చూపి కాలవ్యవధిని 2014 సెప్టెంబర్ వరకు పొడిగించుకున్నారు. ప్యాకేజి నెం.35లో సర్వేపల్లి కాలువ, ఈదగాలి, వల్లూరు కాలువల లైనింగ్ పనులు, సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధి, తూముల రెగ్యులేటర్ల మరమ్మత్తుల పనులు చేర్చారు. ఈ పనులకు 80.40 కోట్ల రూపాయలు కేటాయించగా 72 కోట్ల రూపాయల మేర పని జరిగింది. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన జిఎస్ఆర్ కంపెనీ చేపట్టింది. జలయజ్ఞం పనులు ప్రారంభించిన ఐదు సంవత్సరాలలో 90 శాతం మేర పనులు పూర్తిచేసిన ఘనత ఈ కంపెనీకే దక్కుతుంది.

సర్వేపల్లి కాలువ, కృష్ణపట్నం కాలువ గట్టును ఆక్రమించి వాణిజ్య కట్టడాలు, నివాసాలు నిర్మించి వున్నారు. ఇక్కడ కాంక్రీటు గోడలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి వున్నారు. ప్రభుత్వం నుండి అనుమతి లభిస్తే మిగిలిన పది శాతం పని పూర్తిచేసే అవకాశం వుంది. మీడియం ఇరిగేషన్ కింద కనుపూరు కాలువ సిస్టం ఆధునీకరణ, డిస్ట్రిబ్యూటరీ సిస్టం ఆధునీకరణ పనులు చేపట్టారు. పై రెండు పనుల్లో ఒక పనిని ఎపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టగా, కాలువ సిస్టం ఆధునీకరణ పనులను హైదరాబాద్‌కు చెందిన ఎకెఆర్ కోస్టల్ కంపెనీ చేపట్టింది. గడిచిన ఐదు సంవత్సరాల్లో కేవలం ఏడు కిలోమీటర్ల వరకు మాత్రమే లైనింగ్ పనులు పూర్తి చేశారు. కట్టడాల పునర్నిర్మాణం గురించి అసలు పట్టించుకోలేదు. ఈ పనికి 71.64 కోట్ల రూపాయలు కేటాయించగా 16.92 కోట్ల రూపాయలు ఖర్చు చేశారంటే పనులు ఏ మేరకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఎపిఆర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రధాన డిస్ట్రిబ్యూటరీ సిస్టం, గురివిందపూడి, ఇడిమేపల్లి బ్రాంచి కాలువల కొరకు రీచ్‌ల త్రవ్వకం పనులు అసంపూర్తిగానే వున్నాయి. ఈ పనులకు 25.50 కోట్ల రూపాయలు కేటాయించగా ఇప్పటి వరకు 15 కోట్ల రూపాయల మేర పని పూర్తి చేయగలిగారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు 2014 సెప్టెంబర్ వరకు గడువు కోరుతూ నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి వున్నారు. ఈ పనులు కాకుండా పెన్నా డెల్టాలో డ్రైనేజి పనులు చేపట్టడం జరిగింది. 13వ ఫైనాన్స్ క్రింద 132 పనులకు అంచనాలు రూపొందించి పరిపాలనా అనుమతి కొరకు నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ పంపారు. కాళంగి, సర్ణముఖి, కండలేరు, చల్లకాలువ కరకట్టల అభివృద్ధికి పనులు జరుగుతున్నాయి. ఇందుకు దాదాపు 500 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు.



సర్వేపల్లి కాలువకు లైనింగ్ పనులు ఎప్పుడు?

నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నందున కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతను పాటించడంలేదని తెలిసింది. మొత్తం మీద జలయజ్ఞం పేరుతో శ్రీకారం చుట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎప్పటికి పూర్తిచేస్తారో వేచి చూడాలి.



సమంత లభ్ధ హుషారు!

ప్రేక్షకుల నుంచే కాదు... దర్శకుల నుంచి కూడా మార్కులు కొట్టేస్తోంది హీరోయిన్ సమంత. తాజాగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ మెప్పు కూడా పొందింది సమంత. ఒక సన్నివేశం ఇవ్వగానే దాన్ని అక్కడికక్కడే మరింత అందంగా మార్చి కెమెరా ముందుకెళ్తుంటుందని సమంత గూర్చి చెప్పుకొచ్చాడు త్రివిక్రమ్. ఇటీవల 'అత్తారింటి దారేది' సినిమా కోసం ఈ ఇద్దరూ కలసి పనిచేశారు. సినిమాలో పవన్ కళ్యాణ్‌ని బావా అని పిలిచే సన్నివేశాలున్నాయి. వాటిలో సమంత బాగా చేసిందని చెప్పారు త్రివిక్రమ్. నేను చెప్పిన దానికంటే ఎక్కువగా చేసింది సమంత. తన సొంత ఆలోచనలతో నటిస్తుండడంతో చూసి నేను కట్ కూడా చెప్పలేకపోయానన్నారు త్రివిక్రమ్. అలాగే సమంత సెట్‌లో చాలా సందడి చేస్తుంటుందని కూడా చెప్పారు. చూడ్డానికి ఇలా అమాయకురాలిగా కనిపిస్తుందికానీ... సమంత భలే చిలిపి, తనదైనశైలిలో అల్లరి చేస్తుంటుందని చెప్పుకొచ్చారు.



కొత్త కథలు వినని అనుష్క!

హీరోయిన్ అనుష్క ఇప్పుడు ఫుల్ బిజీలో ఉంది. రాణీరుద్రమగా కనిపిస్తూనే బాహుబలి కోసం ప్రభాస్‌తో జతకడుతోంది. వీటితోపాటు 'వర్ణ' కోసం కత్తి యుద్ధాలు చేస్తోంది. ఈ మూడు సినిమాలపైనే అనుష్క తన దృష్టి కేంద్రీకరించింది. కొత్తగా సినిమాలేవీ ఒప్పుకోవడం లేదు. ఈ మధ్య ఇద్దరు ముగ్గురు తెలుగు నిర్మాతలు సంప్రదిస్తే ఇప్పట్లో కొత్త కథలేవీ వినడం లేదండీ అనేసిందట. ప్రస్తుతం నా చేతిలో భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. అవి నా కెరీర్‌కు చాలా కీలకం. ఈ దశలో మరో సినిమాని ఒప్పుకొని అనవసరంగా నాపై ఒత్తిడి పెంచుకోలేను అంటోంది ఈ స్వీటీ. అంతే కాదు 2014 ఏప్రిల్ వరకు అనుష్క మరో సినిమాను ఒప్పుకోనని స్పష్టం చేసింది.

హాలీవుడ్‌కు వెళ్లడం లేదు!


ప్రకాష్‌రాజ్ హాలీవుడ్‌లోకి అడుగు పెట్టబోతున్నాడు. ప్రఖ్యాత దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు అని గత కొద్ది రోజులుగా బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ఇవే మాటలు వినిపిస్తున్నాయి. వాస్తవం చెప్పాలంటే ఒక భాషతో సంబంధం లేని నటుడు ప్రకాష్‌రాజ్. ఆయన ప్రతిభను బట్టి చూస్తే హాలీవుడ్ సినిమా వార్తల్లో నిజం ఉండొచ్చేమో అనుకొన్నారు. ప్రకాష్‌రాజ్ మాత్రం ఆ వార్తను తోసి పుచ్చారు. హాలీవుడ్ వర్గాలు నన్ను సంప్రదించిన మాట వాస్తవమే కానీ... ఆ సినిమా కార్యరూపం దాల్చలేదు అన్నారు. ప్రస్తుతానికి హాలీవుడ్‌లో సినిమాలేవీ చేయడం లేదని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆయన ఉలవచారు బిర్యానీ చిత్రాన్ని తెరకెక్కిస్తూ బిజీగా గడుపుతున్నారు.





రాజమౌళి జాగ్రత్తలు!

దర్శకుడు రాజమౌళి తీసే సినిమా సెట్‌కెళ్లి చూస్తే అక్కడంతా కార్పొరేట్ వాతావరణం కనపడుతోంది. ఐడికార్డులు, యూనిఫామంటూ సరికొత్త పోకడ సాక్ష్యాత్కరిస్తుంది. అయితే ఇప్పుడాయన బాహుబలి కోసం కొత్త జాగ్రత్తలు తీసుకొంటున్నాడు. అత్తారింటికి దారేది సినిమా ముందుగానే లీకవ్వడంతో బాహుబలి సెట్‌లోకి సెల్‌ఫోన్‌లను అనుమతించడం లేదు. హీరో, హీరోయిన్లు, సాంకేతిక సిబ్బంది ఎవరి చేతుల్లో ఫోన్లులేవు. వాకీటాకీలు ఉపయోగిస్తున్నారు. ఐడి కార్డ్ లేకుంటే సెట్‌లోనికి ప్రవేశం లేదు. సినిమా విషయాలేవీ బయటకు చెప్పకూడదని ముందే టీమ్‌కి గట్టిగా చెప్పారట జక్కన్న.



లేటుగా పెళ్లి చేసుకో...

సైఫ్‌అలీఖాన్ సలహాలు అనుభవించి మరీ ఇస్తుంటాడు. చెల్లెలు సోహాఅలీఖాన్‌ని 40 సంవత్సరాలు నిండేదాకా పెళ్లి చేసుకోవద్దంటున్నాడీ నటుడు. పెళ్లి నూరేళ్ల జీవితం. ఇంకొక వ్యక్తి మన జీవితంలో అడుగు పెట్టిన క్షణం సహజీవనానికి సిద్ధమయ్యే తొలి మజిలీ. ఆ అడుగులు ఆచితూచి మరీ వెయ్యాలి అని చెల్లెలికి హితబోధ చేశాడు. సోహా ఇప్పటికే కునాల్ ఖేమూతో సహజీవనం సాగిస్తోంది. ఈ మధ్యే వారిద్దరూ ఒక కొత్త ఇంట్లోకి మారారు కూడా. సోహా తల్లి మాజీ నటి షర్మిలా ఠాగూర్ కూతుర్ని త్వరగా పెళ్లిచేసుకోమని పోరుతున్నా, అన్న ఇచ్చిన సలహానే భేషుగ్గా వుందంటోంది సోహా. కునాల్ ఖేమూ మంచి హాస్యప్రియుడు. ఎప్పుడూ నన్ను ఉల్లాసంగా ఉంచేందుకు ప్రయత్నిస్తుంటాడు. కునాల్ మంచి కండలవీరుడు. ఈ మధ్య ఇంట్లో దొంగతనం జరిగితే ఆ దొంగను ఇట్టేపట్టేసి పోలీసులకు అప్ప జెప్పిన హీమ్యాన్ కునాల్ అంటుంది.



భాయ్ బోర్!

✍ అల్లూరు రహీం

ట్రెండ్‌ని బట్టి అందరూ మారుతూ ఉంటారు. కొందరు మాత్రమే ట్రెండ్‌ని మారుస్తుంటారు. ఆ కొందరిలో ఒక్కడు హీరో నాగార్జున. కమర్షియల్ విలువలు పాటిస్తూ కొత్తదనానికి దారిస్తూ ఇలా రెండు రకాల ప్రయాణాలు ఒకేసారి చేయడంలో దిట్ట. రాజన్న, షిరిడిసాయి, ధమరుకం చిత్రాల్లో ప్రత్యేకంగా కనపడ్డ నాగార్జున తనకు అలవాటైన మాస్ చిత్రంలో నటించాలనే తహతహతో అహనా పెళ్లంట, పూలరంగడు వంటి కామెడీ చిత్రాలను తీసిన దర్శకుడు వీరభద్రమ్‌కు 'భాయ్' చిత్రం తీసే అవకాశమిచ్చాడు. ఈ చిత్రానికి నాగార్జునే నిర్మాత. రెండు చిన్న చిత్రాలు తీసిన దర్శకుడైన వీరభద్రమ్ పెద్ద హీరో నాగార్జున ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోయాడు. భాయ్ చిత్రాన్ని జనరంజకంగా తీయలేకపోయాడు. పాత చింతకాయ పచ్చడిలాంటి భాయ్ కథకు మంచి తిరగమాత పెట్టలేకపోయాడు. ప్రథమార్థ మంతా హాంకాంగ్ మాఫియా చుట్టూ తిప్పిన కథను ద్వితీయార్థంలో ఢీ, బాడ్‌షా వంటి కామెడీ చిత్రాల తరహాలో తిప్పే ప్రయత్నంలో బొక్కబోర్లా పడ్డాడు. ఘటికాచలంతోపాటు అర డజను మంది యువ రచయితల బృందంతో వ్రాయించిన పంచ్ డైలాగుల్లో ఓ పాంచ్(ఐదు) పేలాయి అంతే. హాంకాంగ్‌లో చీకటి సామ్రాజ్యాన్ని శాసించే డాన్ డేవిడ్ హైదరాబాద్‌కు వచ్చి కుడితెలో పడ్డ ఎలుకలా కొట్టుకోవడం ఆ పాత్రతోపాటు చిత్రాన్ని బలహీనం చేసి పారేసింది. ఈ మధ్య మంచి మంచి పాటల స్వరకర్తగా పేరు తెచ్చుకున్న సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ భాయ్‌లో ఐటమ్ పాట రయ్ రయ్ మినహా మరో పాటకు మంచి సంగీతమివ్వలేక పోయాడు. వీరభద్రమ్ నాగార్జున, రిచా గంగోపాధ్యాయ కాంబినేషన్‌లోని పాటలను చూడచక్కగా తీయలేకపోయాడు. దీనివల్ల కెమెరామెన్ సమీర్‌రెడ్డి శ్రమ బూడిదలో పోసిన పన్నీరయ్యింది. డైలాగుల్లో హైదరాబాద్‌లో రెండే ఫేమస్... ఇరానీ ఛాయ్, రెండవది భాయ్. ఈ ఫీల్డ్‌లో కొత్తగా ట్రై చేయాలంటే నేనేరా. గ్లామర్ నేర్పింది... గ్లామర్ తెచ్చింది నేనే. గెలుపు నా గర్ల్ ఫ్రెండ్. రాజీపడే వాడు రాజకీయ నాయకుడు. మగాళ్లకు మైండ్ ట్యూబ్‌లైట్‌లాగా వెలుగుతుంది. పగ ఎవడిదైతే వాడే ప్రతీకారం తీర్చుకోవాలి బాగా పేలాయి. విక్రమ్ డోనర్ పాత్రలో బ్రహ్మానందం, రాజు మ్యాన్షన్‌గాడిగా తాగుబోతు పాత్రలో ఎంఎస్‌నారాయణ పెద్దగా రాణించలేక పోయారు. రౌడీ క్యారక్టర్లు చేసే నటుల చేత చేయించిన కామెడీ ఎందుకనో పేలలేదు. మూడు గెటప్పులతో కనిపించే నాగార్జున సైతం ప్రేక్షకులను మెప్పించలేక పోయాడు.

చిత్ర కథలోనికి వెళ్తే డేవిడ్(ఆశిష్ విద్యార్థి)హాంకాంగ్‌లో చీకటి సామ్రాజ్య అధినేత. అతనికి భాయ్(నాగార్జున) కుడి భుజం. భాయ్‌కు డేవిడ్ అత్యంత విలువనివ్వడం ఆయన కుమారులు(సోనూ సూద్, అజయ్)లకు నచ్చదు. హైదరాబాద్‌లోని డేవిడ్ మాఫియా సామ్రాజ్యాన్ని అండర్ కవర్ కాప్(ప్రసన్న) ఒక పథకం ప్రకారం ధ్వంసం చేస్తుంటే అతని పని పట్టను డేవిడ్ భాయ్‌ను ఇక్కడకు పంపుతాడు. ఒక పెళ్లి ఫంక్షన్‌లో అతన్ని చంపనుబోయిన భాయ్ ఆ కాప్ తన తమ్ముడని ఆగిపోతాడు. ఈ సమయంలో టోనీ(అజయ్) ఆ ప్రత్యేక పోలీసు అధికారిని చంపనుబోయి అతని చేతిలో చనిపోతాడు. దీంతో డేవిడ్‌నే ప్రత్యేక పోలీసు అధికారిని చంపాలని ఇండియా వచ్చి రాష్ట్ర హోం మంత్రి ముకుల్‌పాండే(షాయాజి షిండే) ఇంట్లో బస చేస్తాడు. తన చెల్లెలు(జరాషా) పెళ్లిని పురస్కరించుకొని ఆ ఇంట్లోకి వెడ్డింగ్ ప్లానర్‌గా వెళ్లే భాయ్ బృందం ఇంట్లో వాళ్లు ఎదుర్కొంటుండే వచ్చే సమస్యలన్నీ తీరుస్తుంది. ఈ సమయంలోనే చిత్రం కామెడీ ట్రాక్‌లో నడుస్తుంది. శత్రుశేషాన్ని భాయ్ తుద ముట్టించడంతో చిత్రం పరిసమాప్తమవుతుంది. దర్శకుడు చిత్రం విడుదలకు ముందు చెప్పినట్లు 'భాయ్' యాక్షన్ ఎంటర్‌టైనర్ కాదు లేని తలనొప్పిని తెచ్చే చిత్రమని తేల్చి చెప్పేయవచ్చు.

చిత్ర సమీక్ష

పోస్టల్ శాఖలో పలు కొత్త పథకాలు!

నెల్లూరులో వెల్లడించిన చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బి.వి.సుధాకర్.

పోస్టల్ శాఖలో పలు కొంగ్రొత్త పథకాలను ప్రవేశపెడుతున్నామని వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని నెల్లూరీయుడు, ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.వి.సుధాకర్ కోరారు. 26వ తేది నెల్లూరుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తపాలా శాఖకు 150ఏళ్ల చరిత్ర ఉంది. భారతదేశంలో మాదిరి ప్రపంచంలోని ఏ దేశంలోనూ లక్షా 55వేల పోస్టాఫీసులు, నాలుగు లక్షలా 75 వేల మంది ఉద్యోగులు లేరు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో 16,142 పోస్టాఫీసులు 40వేల మంది ఉద్యోగులతో పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో 777 పోస్టాఫీసుల్లో 512 మంది పర్మినెంట్, 1358 మంది ఇడి ఉద్యోగులతో పనిచేస్తున్నట్లు చెప్పారు. పోస్టల్ శాఖ ఈ యేడాది 75 కోట్ల ఉత్తరాలు బట్వాడా చేసినట్లు వివరించారు. జిల్లాలో డిసెంబర్ 15వ తేది లోపల చింతారెడ్డిపాళెం, మాంబట్టులోని ఎస్ఇజడ్‌లో కొత్త పోస్టాఫీసు పెడుతున్నామన్నారు. పోస్టాఫీసుల్లోనూ మీ – సేవా సర్వీసులు ప్రారంభించనున్నామని నెల్లూరు, కావలి, గూడూరు హెడ్ పోస్టాఫీసుల్లో 177 ప్రభుత్వ సర్వీసులను పొందవచ్చున్నారు. దీనికి 25 రూపాయల నుంచి 35 రూపాయల మేరకే వసూలు చేస్తామన్నారు. పోస్టల్ శాఖలో మొబైల్ మనియార్డర్ సర్వీసును అందుబాటులోనికి తెస్తున్నామని సెల్ ఫోన్ ఉన్న వారి నెంబర్లకు సీక్రెట్ కోడ్ వర్డ్‌లో క్షణాల్లో డబ్బు అందిపోతుందన్నారు. ఇన్ స్టెంట్ మనియార్డన్ సర్వీసుతో దేశంలో ఎక్కడైనా కేవలం 150 రూపాయల కమిషన్‌తో 50వేల రూపాయల వరకు అందిస్తామన్నారు. మై స్టాంప్ పథకంలో 300 రూపాయలు కట్టిన వ్యక్తి ఫోటో అందించిన వెంటనే 5 రూపాయలు విలువచేసే స్టాంప్స్ షీట్ ఒకటి ఇస్తామని దీన్ని నవంబర్ 15 నుంచి నెల్లూరు జిల్లాలో ప్రవేశ పెడతామన్నారు. ప్యాక్ పోస్ట్ ద్వారా విదేశాలకు అన్ని రకాల వస్తువులను పంపను తామే ప్యాక్‌చేసి ఇస్తామని పోస్ట్‌మాస్టర్ జనరల్ వివరించారు. పోస్టల్ శాఖకు మొబైల్ ఫోన్ నెంబరు ఇస్తే రిజిష్టర్ ఆర్టికల్ వచ్చిన వెంటనే ఉత్తరం వచ్చిందనే మెసేజ్ పంపుతామని, దీన్ని వినియోగదారుడు వీలునుబట్టి ఎప్పుడైనా అందుకోవచ్చన్నారు. మీరు – మీ డబ్బు, వరల్డ్ నైట్ ఎక్స్‌ప్రెస్, ఆశీర్వచనం పథకాలు కూడా కొత్తగా ప్రవేశ పెడుతామన్నారు. ఆర్ఎస్‌సిటి పథకంలో భాగంగా వచ్చే రెండేళ్లలో పోస్టాఫీసులన్నింటికీ కొత్త భవనాలు నిర్మిస్తామని నెల్లూరులో కొత్త పోస్ట్ బాక్సులు, మెయిల్ మోసుకెళ్లను కొత్త వ్యాన్ అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎన్.సంపత్, నెల్లూరు పోస్టల్ సూపరింటెండెంట్ పి.పరిశుద్ధరావు కూడా పాల్గొన్నారు.



శుభమస్తు షాపింగ్ మాల్‌లో సినీ నటి ప్రణీత.

శుభమస్తు షాపింగ్ మాల్ ప్రారంభం!

నెల్లూరు వచ్చిన నటి ప్రణీత

నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో శుభమస్తు షాపింగ్ మాల్‌ను 23వ తేది అత్తారింటికి దారేది ఫేమ్ హీరోయిన్ ప్రణీత ప్రారంభించారు. నెల్లూరులో మహా నగరాలకు ధీటుగా ఇటువంటి ఫ్యామిలీ షాపింగ్ మాళ్ల అవసరం ఎంతైనా వుందన్నారు. మాల్ అధినేతలు బయ్యా రమణయ్య, బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ వ్యాపారపరంగా అభివృద్ధి చెందాలని ప్రణీత ఆకాంక్షించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ అధినేత బయ్యా రమణయ్య మాట్లాడుతూ వ్యాపార రంగంలో 60ఏళ్ల అనుభవం వుందని, ఆధునిక ప్రపంచంలో ఫ్యాషన్‌కు అనుకూలంగా అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేందుకు శుభమస్తును ఏర్పాటు చేశామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సింథటిక్, లో ఫ్యాన్సీ, లేడీస్ యాక్ససరీస్, కాస్మోటిక్స్, ఒన్ గ్రామ్ జ్యూయలరీ, ఫస్ట్ ఫ్లోర్‌లో పట్టు, డిజైనర్ హైఫ్యాన్సీ, హ్యాండ్ లూమ్స్, సెకండ్ ఫ్లోర్‌లో మెన్స్ రెడిమేడ్స్, టెక్స్‌టైల్స్, మూడవ ఫ్లోర్‌లో కిడ్స్, డ్రస్ మెటీరియల్స్, పంజాబీస్, గాగ్రాస్, వెస్టన్ వేర్స్ అందుబాటులో ఉంటాయన్నారు. అప్పుడే పుట్టిన పాపాయి దగ్గర నుంచి కుటుంబంలో ప్రతి ఒక్కరికీ కావాల్సిన బట్టలు తమ షాపింగ్ మాల్‌లో లభిస్తాయన్నారు.

ఉత్తరక్రియలు



29-06-1952 - 27-10-2013

పెద్దకర్మ

06-11-2013 బుధవారం ఉ॥10.00

దేవిరెడ్డి రాణిప్రమీల

w/o Late దేవిరెడ్డి జగదీష్‌కుమార్‌రెడ్డి

కుమారులు – కోడళ్లు	మనుమడు – మనుమరాళ్లు
డా॥ దేవిరెడ్డి సత్యకుమార్‌రెడ్డి – సుదతి	శ్రీలయ
దేవిరెడ్డి చైతన్యకుమార్‌రెడ్డి – చెరిత	శ్రీలక్ష్య
దేవిరెడ్డి శ్రీకర్‌రెడ్డి – వైద్య	యష్‌నీల్

అన్న : మూలంరెడ్డి సుబ్బరామిరెడ్డి అక్క : పెనుబాక రాణిసంయుక్త

16/1884, మిలీనియం సబ్ స్టేషన్ ఎదురుగా, మినీ బైపాస్‌రోడ్డు
శ్రీనివాస అగ్రహారం, నెల్లూరు.

చిత్తూరుకు నీటి తరలింపు

మొదటి పేజీ కొరవ

జరగదు, జరగబోదు. కడప, కర్నూలు వంటి జిల్లాల వారైతే ఈ పాటికి కర్రలు, కొడవళ్లు, రోకళ్లు తీసుకొని టెండర్లు పిలిచిన వాడిని, టెండర్ పాడుకోవడానికి వచ్చే వాడిని చావదన్ని వుండేవారు.

కండ్లేరు రిజర్వాయర్ నిర్మించిన ఉద్దేశం వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, సత్యవేడు నియోజకవర్గాలలోని లక్షలాది ఎకరాల మెట్ట పొలాలను సాగు యోగ్యం చేయడం మాత్రమే. స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనాటి నీటిపారుదల నిపుణుడు శ్రీరామకృష్ణయ్య కలిసి ఎంతో దూరదృష్టితో నిర్మింపచేసిన భారీ చెరువు ఇది. ఒక రకంగా చెప్పాలంటే నెల్లూరుజిల్లా రైతాంగానికి ఎన్టీఆర్ ప్రసాదించిన అద్భుత వరం కూడా. నిజానికి అంత పెద్ద రిజర్వాయర్ నింపడానికి కండ్లేరు వాగులో నీళ్లు లేవు. కానీ మద్రాసుకు మంచినీరు ఇవ్వాలనేది అంతర్ రాష్ట్ర ఒప్పందం కాబట్టి, ఆ పేరు పెట్టి ఇంత భారీ చెరువు నిర్మించాడు ఎన్టీఆర్. దాని సామర్థ్యం 72 టిఎంసిలు. కృష్ణ వరద నీటిని సోమశిలకు తరలించి, అక్కడ నుంచి కండ్లేరు నింపాలన్నది నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కల. ఒకసారి కండ్లేరు రిజర్వాయర్ పూర్తి నీటి మట్టానికి చేరుకొంటే, కనీసం మూడేళ్లపాటు రెండున్నర లక్షల ఎకరాలకు ఒక పంటకు సరిపడా సాగు నీరు లభిస్తుంది. అయితే దురదృష్టవశాత్తు ఎప్పుడో 1995లోనే రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయినా ఇప్పటి వరకు ఒక్క ఏడాది కూడా సగం చెరువు నిండలేదు. ఏ ఏడాది కూడా 45 టిఎంసిల నీటి నిల్వ దాట లేదు. ఈ పద్దెనిమిది ఏళ్లలో ఏడు సంవత్సరాలు అసలు సోమశిల నుంచి చుక్క నీరు కూడా రాలేదు. వెంకటగిరి కొండల నుంచి వాన నీరు మాత్రమే కండ్లేరు చెరువుకు నీటి తడి కల్గిస్తున్నది. దానివల్ల ఒకటికి ఏడు బ్రాంచ్ కాలువలు త్రవ్వినా గ్రామాలకు నీరు పారడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే, కండ్లేరు రిజర్వాయర్ నిర్మించిన ప్రయోజనం ఈనాటి వరకు నెల్లూరుజిల్లా రైతాంగానికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు.

రైతు బ్రతుకు చిదిమేసిన రామనారాయణరెడ్డి

కండ్లేరు నుంచి నీటి తరలింపుకు కుట్ర పన్నింది ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అయినా, దానికి కారకుడు మాత్రం ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి. ఈ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. అయినా సరే 5900 కోట్ల ఖర్చుకు ఆమోద ముద్ర వేశాడాయన. అది కూడా, అన్ని చట్టాలు, సాంప్రదాయాలకు విరుద్ధంగా. ఈ నీటి తరలింపుకు ముఖ్యమంత్రి పెట్టిన పేరు చిత్తూరు జిల్లాకు మంచి నీళ్లనే. అదే నిజమైతే, గ్రామీణ నీటి సరఫరా మంత్రిత్వ శాఖ అనుమతి కావాలి. ఒకవేళ సాగునీరు అనుకొంటే ఇరిగేషన్ శాఖ అనుమతి కావాలి. కానీ ఈ రెండు శాఖలనూ పక్కనపెట్టి, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మంత్రిత్వ శాఖ ద్వారా అనుమతి ఇప్పించారు. పథకం అమలుకు ఇన్‌క్యాప్ అనే మూతపడిన ప్రభుత్వ కార్పొరేషన్‌ను రంగంలోకి దించాడు. ఈ డొంకతిరుగుడు కేటాయింపు చట్ట విరుద్ధం. అయినాసరే ఆర్థికమంత్రి అంగీకారం తెలిపాడు.

వందకోట్ల లంచం

రామనారాయణరెడ్డి ఇంత దుర్మార్గాన్ని వూరకే చేయలేదు. అందుకు పరిహారంగా ఆయనకు భారీ మొత్తంలో లంచం ముట్టబోతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ఈ పథకం నిర్మాణానికి మొదటి విడతగా రెండు వేల కోట్ల రూపాయల విలువైన టెండర్లు పిలుస్తున్నారు. ఆ కాంట్రాక్టర్లకు 10శాతం మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇస్తామని టెండర్ పత్రంలోనే పేర్కొన్నారు. ఈ 10 శాతంలో ఐదు శాతం రామనారాయణరెడ్డి వాటా అని చెప్తున్నారు. అంటే టెండర్లు పిలిచీ పిలవగానే దాదాపు వంద కోట్ల రూపాయలు రామనారాయణరెడ్డి బొక్కసంలో చేరబోతున్నాయన్న మాట. ఆ వంద కోట్ల రూపాయల అవినీతి ఆర్జన కోసం వేలాది మంది రైతుల బ్రతుకులను, భవిష్యత్తును దారుణంగా చిదిమి పారేయడానికి సిద్ధపడ్డాడు రామనారాయణరెడ్డి.

టెండర్ షరతుల దగా

టెండర్లు స్వేచ్ఛగా, పోటీ వాతావరణంలో జరిగితే, ఒక్కొక్క ప్యాకేజి ఒక్కొక్క కాంట్రాక్టర్ దక్కించుకొంటే, ఇంతింత పెద్ద మొత్తాలలో లంచాలు ముట్టడం సాధ్యం కాదు. అందుకోసం ఈ టెండర్లను కూడా భ్రష్టు పట్టించారు ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి కలిసి. టెండర్ వేయడానికి వారు పెట్టిన షరతులు చూస్తే పసి పిల్లవాడికి కూడా అర్థమైపోతుంది. ఈ పనులు చేయడానికి ప్రధానంగా మూడు షరతులు విధించారు. మొదటిది – పైప్ లైన్ తయారీదారులై వుండాలి. ప్రభుత్వానికి కావలసింది – భూమిలోపల పైప్ లైన్ వేసి, నీరు పారించడం, ఆ పని చేయవలసింది అందులో అనుభవం వున్న కాంట్రాక్టర్. కానీ పైప్ తయారీదారుడై వుండాలని షరతు పెట్టారంటే, ఈ రెండు వసతులూ కల్గిన కాంట్రాక్టర్ ఎవరో వారి మనసులో వుండి వుండాలి. అతడి ద్వారా తమ లంచాల వాటా దండుకొనే ఏర్పాటు జరిగిందని అర్థం.

రెండవ షరతు – వాటర్ వర్క్స్ పైప్ లైన్ వేసిన అనుభవం మాత్రమే కలిగి వుండాలన్నది. పైప్ లైన్ అంటే ఒక్క నీళ్ల కోసమే కాదు, నేచురల్ గ్యాస్, పెట్రోల్, ముడి చమురు వంటి వివిధ అవసరాల కోసం పైప్ లైన్లు వేస్తారు. మంచినీళ్ల కంటే, గ్యాస్ వంటి అవసరాల కోసం వేసే పైప్ లైన్లకు మరింత అధిక నిపుణత కావాలి. కానీ మాకు మంచి నీళ్ల పైపులు వేసిన కాంట్రాక్టర్లే కావాలని షరతు పెట్టారు. సాధారణంగా ఒక కాంట్రాక్టర్‌కు పని అనుభవం వుంటే, మరొక కాంట్రాక్టర్‌కు ఆర్థిక స్థోమత వుంటుంది. అందువల్ల ఇద్దరూ కలిసి జాయింట్ వెంచర్ పద్ధతిలో టెండర్ వేయడానికి అనుమతి ఇస్తారు. కానీ ఇక్కడ మాత్రం జాయింట్ వెంచర్ అనుమతి లేదు. టెండర్‌లో పెట్టిన షరతులు చూస్తే, ఒకే ఒక కాంట్రాక్టర్‌కు మొత్తం పనులు కట్టబెట్టడానికి పథకం పన్నుతున్నారని చెప్పకనే అర్థమైపోతున్నది.

అంత ఎత్తుకు నీరెట్లా పారుతుంది?

కండ్లేరు రిజర్వాయర్ సముద్ర మట్టానికి 89 మీటర్ల ఎత్తులో వుంది. చిత్తూరు పట్టణం 333.75 మీటర్ల ఎత్తులో వుంది. మదనపల్లె 690 మీటర్ల ఎత్తులో వుంది. టెండర్లు పిలిచింది గ్రావిటీ ద్వారా నీరు సరఫరా చేసే పైప్‌లైన్ నిర్మాణం కోసం. నీరు పల్లమెరుగు తప్ప ఎత్తుకు ఎగరలేదు. మరి కండ్లేరు నుంచి మదనపల్లెకు, చిత్తూరుకు నీరెట్లా పారిస్తారు?

దీని అర్థం – 5990 కోట్ల రూపాయల భారీ వ్యయంతో చేపట్టిన ఈ పథకానికి కనీసపాటి సర్వే కూడా జరగలేదని. అది మంచినీళ్ల పథకమైనా, సాగు నీటి పథకమైనా ముందుగా సర్వే చేసి, కొలతలు కొలిచి, ఆచరణ సాధ్యమైన డిజైన్ రూపకల్పన చేసి, అందుకు ఖర్చు ఎంతో అంచనావేసి టెండర్లు పిలవడం ప్రభుత్వం చేయవలసిన పని. కానీ ఈ విషయంలో అటువంటి ప్రాథమిక సన్నాహాలేవీ లేవు. కనీసం ఏ దారిలో పైప్‌లైన్ నడవాలి, దారిలో రైతుల పొలాలు వున్నాయా, అటవీ భూములేమైనా వున్నాయా, కొండలు గుట్టలు అడ్డం వస్తాయా అన్న కనీసపాటి పరిశీలన కూడా జరపలేదు. గుడ్డెద్దు చేలో పడినట్లు, టెండర్లు పిలిచేశారు. ప్రభుత్వ ఖజానా కొల్లగొట్టడానికి తొందరపడుతున్నారు.

ఇన్‌క్యాప్ ఒక దివాలా సంస్థ

ఇంత భారీ నిర్మాణం పనిని ఇంజనీరింగ్ అనుభవం, సిబ్బంది, నిపుణత కల్గిన ప్రభుత్వ శాఖ ద్వారా జరిపించాలి. కానీ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ వంటి శాఖలను పక్కనపెట్టి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ – ఇన్‌క్యాప్ – అనే సంస్థకు బాధ్యత అప్ప చెప్పారు. అదొక దివాలా సంస్థ. దానికి నిధులు లేవు, వనరులు లేవు, కనీసపాటి సిబ్బంది కూడా లేరు. నిజం చెప్పాలంటే, కుర్చీలు, టేబుళ్లు కూడా లేవు. క్రికెట్ స్టేడియం, వ్యర్థ జలాల శుద్ధి వంటి తాలూ తరక ప్రాజెక్ట్‌ల రూపకల్పన తప్ప ఆ కార్పొరేషన్ ఇప్పటి వరకు చేసిన పని అంటూ ఏదీ లేదు. కనీసపాటి ఇంజనీరింగ్ సిబ్బంది కూడా లేని సంస్థ నిర్వహణలో 5990 కోట్ల రూపాయల భారీ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ పనులు ఎట్లా అమలు జరుగుతాయి. ఎవరు పర్యవేక్షిస్తారు? ఎవరు డిజైన్ చేస్తారు, ఎవరు డ్రాయింగ్‌లు గీస్తారు?

ఈ మొత్తం వ్యవహారం చూస్తే ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి కలిసి ప్రభుత్వ ఖజానాను దోచుకోవడానికి ఈ పథకాన్ని ఒక మార్గంగా ఎంచుకొన్నారన్న నిజం చెప్పకనే అర్థమైపోతున్నది.

వైఎస్ జగన్ 16 నెలల పాటు జైలులో మ్రగ్గిపోవడం చూసిన తర్వాత కూడా రాజకీయవాదులకు బుద్ధి కల్గక పోవడం విచారకరం. అధికారంలోకి వచ్చింది, మంత్రి పదవులు దక్కించుకొన్నది ప్రజలను, ప్రభుత్వాన్ని దోచుకోవడానికి మాత్రమే అనే బందిపోటు తత్వం మన రాజకీయ వాదులలో ఎంతగా స్థిరపడి పోతున్నదో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

ఏది ఏమైనా, కండ్లేరు నుంచి నీటి తరలింపును ఈ దశలోనైనా అడ్డుకోవడం జిల్లాలోని ప్రజా ప్రతినిధుల కర్తవ్యం. కాంగ్రెస్‌వాదులు మంత్రిని చూసి భయపడడంలో అర్థం వుంది. కానీ వైఎస్ జగన్ పార్టీ కూడా ఆయనతో లాలూచీ పడడం ఏమిటి? ఈ దుర్మార్గాన్ని ప్రశ్నించక పోవడం ఏమిటి?

సణుగుడు

9వ పేజీ కొరవ

విలేఖరులకు తలా ఒక పట్టా ముష్టి వేశాడు. తతిమా వన్నీ నిర్భయంగా అమ్ము కొన్నాడు. హౌసింగ్ బోర్డు సిబ్బంది ఇదేమని అడగబోతే, ఎమ్మెల్యే గట్టిగా హుంకరించాడట. దానితో వారు తోక ముడిచేశారు.

అది చాలక, సావిత్రి నగర్ మూడవ వీధిలో మునిసిపల్ పాయిఖానాల మీద పడ్డాడు. ఆ స్థలానికి తన స్వంత అత్త పేరుతోనే పట్టా పుట్టించాడు. నిక్షేపంగా అక్కడొక షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నాడు. స్పిన్నింగ్ మిల్లు లే అవుట్ స్థలం ఇది. అక్కడ ఇప్పుడు గజం ధర బంగారంతో పోటీ పడుతున్నది.

ఇట్లా చెప్పుకొంటూ పోతే నెల్లూరు నగరంలో భూ బకాసురుల కథలకు అంతూ పొంతూ కన్పించడం లేదు. వీరిట్లా పెట్రేగిపోవడానికి కారణం – కలెక్టర్‌తో సహా రెవిన్యూ యంత్రాంగం సమస్తం చచ్చుపడి పోవడం. గతంలో కలెక్టర్ అంటే ప్రజలకు గౌరవం వుండేది. రాజకీయవాదులకు భయం వుండేది. తప్పు చేస్తే కన్నెర్ర చేస్తాడనే వెరపు వుండేది. ఇప్పుడటువంటి భయాలు ఏవీ లేవు. తాము ప్రభుత్వం నుంచి జీతం తీసుకొంటున్నామని, ప్రజలకు బాధ్యత వహిస్తున్నామనే భావనే రెవిన్యూ అధికారులలో కన్పించడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లలో పాచి పని చేసుకొనే వారికి, వీరికి పెద్దగా తేడా లేదు. తాము ఐఎఎస్ చదివామన్న స్పృహ సామాన్య జనం దగ్గర మాత్రమే జ్ఞాపకం వస్తుంది వీరికి.

ఎటువంటి కలెక్టర్లను చూసిన జిల్లా ఇది? ఒక మలయప్పన్, ఒక ఎస్‌ఆర్.శంకరన్, ఒక అర్జున రావు, ఒక సుజాతారావు, ఒక శ్రావణ్‌కుమార్... ఆ పాత పేర్లు తలచుకొంటేనే ఒళ్లు పులకరించిపోతుంది. ఎంత సేవ చేశారు వారు – ఈ జిల్లాకు, ప్రజలకు? రాజకీయవాదులు, ఎంత పెద్ద పదవిలో వున్నా వారి ముందు వినయ విధేయతలతో మెలిగేవారు. కానీ ఇప్పుడూ.... ఐఎఎస్‌లు అదే రాజకీయవాదులకు సాగిలపడి మొక్కుతున్నారు.

అధికారులు ఇంత దుర్భలులు కావడం వల్లనే భూ ఆక్రమణల వంటి అరాచకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. అధికారులలో మార్పు వస్తే తప్ప అవి ఆగవు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ఒకమాట, అధిష్టానం వద్ద మరోమాట చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఇటీవల బిట్ర గుంట వచ్చిన ఆయన రాష్ట్ర విభజన, సమైక్యాంధ్ర ఉద్యమంపై పై విధంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచేందుకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఒక్కరే గట్టిగా కృషి చేస్తున్నారని కితాబిచ్చారు.

బిసి సర్కిల్‌లో రచ్చరాజు!


నెల్లూరు నగరంలోని బిసి స్టడీ సర్కిల్‌లో అన్ని సబ్జెక్టులు తానే చెబుతూ పెత్తనం చేస్తున్న ఫ్యాకల్టీ నాగరాజు వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నాగరాజుకు నిర్దిష్ట విద్యార్హతలు లేకపోయినా ఇండియన్ హిస్టరీ, వరల్డ్ హిస్టరీ, ఎపి హిస్టరీ, ఆంధ్ర హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ ఇలా అన్ని సబ్జెక్టులు ఆయనే బోధిస్తున్నారు. ఆయనకే గుడ్డిగా బిసి వెల్ఫేర్ అధికారులు మద్దతిస్తూ పెద్ద మొత్తం జీతంగా చెల్లిస్తున్నారు. బిసి స్టడీ సర్కిల్‌లో పెత్తనం మొత్తం ఆయనదే. తన బోధన పట్ల సంతృప్తి చెందిన విద్యార్థులను ఆయన బిర్యానీలు పెట్టి సముదాయిస్తున్నాడంటే ఇక్కడ పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని బిసి స్టడీ సర్కిల్‌ను ప్రక్షాళన చేయాల్సి వుంది.

సవరణ

అక్టోబర్ 25తేది 'జమీన్‌రైతు' 9వ పేజీలో దివ్యస్నానం శీర్షికన ప్రచురితమైన ప్రకటనలో పది రోజులకోకమారు చేసిన పాపం అంటదుకు బదులుగా అంటారు వచ్చింది. పొరపాటుకు క్షంతవ్యులం.

పదరంగం -91

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. అంతిమ లక్ష్యం (5)
4. నెయ్యి, ఘృతం (1)
5. మూడు (1)
6. అటునుంచి 'లు' లోపించిన కలుజు (2)
8. తిరునాళ్ళు, జాతర్లలో పిల్లలు తిరిగే రాట్నం (5)
11. అటునుంచి సంవత్సరం (2)
13. సన్నని పుల్ల (3)
15. ఇంగ్లీషు సముద్రం, చూడడం కూడా (1)
16. బూడిద (2)
18. ములక్కాయల ఆకు (4)
20. ఇంగ్లీషు చెట్టు (1)
21. అవమానం (4)
23. 'లు' లోపించిన వగలు (2)
24. అన్నం తినే పళ్ళాలు (3)
27. పత్రాలు - చెట్టువి (3)
28. వారసత్వ హక్కుదారుడు (4)
30. అటునుంచి మృగయా వినోదం (2)
31. తెలుగు ఆక్షన్ (4)
22. అమ్మ కాదు, పర్చేజ్ అటునుంచి (2)
34. కొనదేలి వుండడం (3)
35. సంవత్సరం (3)

నిలువు

1. సువాసన(4)
2. ఏనుగు నడిపేవాడు (4)
3. వ్యతిరేకించడం, ధిక్కరించడం (3)
6. క్రింద నుంచి నాట్య భంగిమలో శివుడు (4)
7. వరుడికి ఇచ్చేది (2)
9. లక్ష్యం (2)
10. భిన్నంలో పైన వుండేది (3)
12. గజము (3)
14. నెపము (2)
17. తడబడిన బాసికం (3)
19. వాయువు (2)
21. ఆభరణాలు (3)
22. క్రింద నుంచి కనిపించకుండా వుండే ప్రదేశం (2)
23. క్రింద నుంచి ప్రభాత సమయం (3)
25. క్రింద నుంచి శ్లాండింగ్ పొజిషన్ (4)
26. క్రింద నుంచి కుమారుడు (3)
27. తెలుగు గేమ్స్ (3)
29. క్రింద నుంచి ఔషధ పదార్థం (3)
31. చల్లగా కాదు, హాట్ (2)
32. లోపావడా (2)

సమాధానాలు

పదరంగం -90

1ఏ	2కాం	తం		3సా	4మూ	హి	5కం		6వ
7ను	తి		8మ	ని	షి		9ప	సి	డి
గు		10అ	తి		11కం	12భూ	కం		మే
	13వె	ల		14తె		ప		15వే	లు
16క	న్నె		17ప	ర	18ప	తి		స	
19న	ల		ర		డి		20సా	వి	21త్రి
కం		22ప	శు	23వు		24న	ఖి		శ
	25త	క	రా	రు		ద్దు		26ప	తి
27ణి	మ		28ము	ప	29కో		30ఖ	ర	
31వా	మ	ను	డు		32తి	రో	గ	మ	నం

సంక్షిప్త సింహపురి

పంచాయతీలకు 13వ ఆర్థిక సంఘం నిధులు

పంచాయతీల్లో అభివృద్ధి పనులను చేయను కేంద్ర ప్రభుత్వం పద మూడవ ఆర్థిక సంఘం నిధులను మంజూరయ్యాయి. జిల్లాకు 10కోట్ల 72లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మరో మూడు కోట్ల రూపాయలు విడుదలవుతాయి. 2011 ఆగష్టు నుంచి 2013 ఆగష్టు నెల వరకు పంచాయతీ ఎన్నికలు జరగకపోవడం వల్ల ఈ నిధులు ఆగిపోయాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలచిపో యాయి. తలసరి 52 రూపాయల చొప్పున ఆర్థిక సంఘం ఈ నిధులను మంజూరు చేస్తుంది. జిల్లాలోని 940 పంచాయతీలకు ఈ నిధులు పంచు తారు. అల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, సూళ్లూరుపేట, ముత్తుకూరు, పొదల కూరు వంటి మేజర్ పంచాయతీలకు ఈ నిధుల మూలంగా 25లక్షలకు పైగా నిధులు సమకూరుతాయి. పెండింగ్‌లో వున్న పనులు చేపట్టను సర్పంచ్‌లకు ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా!

మునిసిపల్ పారిశుధ్య కార్మికులపై పాలకులు చిన్నచూపు చూడడం తగదని మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు విమర్శించారు. పారిశుధ్య కార్మికులతో కలసి కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గలీజుగా వుండే చెత్తాచెదా రాలను పారిశుధ్య కార్మికులు ఎత్తి వేస్తుంటారని అటువంటి వారికి కనీస వేతనం ఇవ్వడంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. చాలీచాలని జీతాలతో కార్మికుల కుటుంబాలు పస్తులుంటున్నాయన్నారు. కనీస వేతనంగా వీరికి 12,500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రావిడెంట్ ఫండ్ నిధులు ఎనిమిది కోట్ల రూపాయలు దుర్వినియోగమయ్యాయని వాటిని ఎక్కడున్నాయో గుర్తించి కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇఎస్ఐ కార్డులు మంజూరు చేసి కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య రక్షణ కల్పించాలన్నారు. ఈ విషయాలపై కార్పొరేషన్ అధికారులు స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ఇసుక రీచ్‌లలో సిసి కెమెరాలు!

జిల్లాలో పెచ్చుమీరుతున్న ఇసుక మాఫియా ఆగడాలను నియంత్రిం చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పెన్నా పరీవాహక ప్రాంతంలోని ఇసుక రీచ్‌లలో నిబం ధనల మేరకే లోడింగ్, తరలింపు జరగాలన్నారు. దీనికి భిన్నంగా వ్యవహ రిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రీచ్‌లో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి త్రవ్వకాలను సమీక్షించాలన్నారు. రీచ్‌లకు సమీపంలో చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి అక్రమ రవాణాను అరికడతామ న్నారు. పొరుగు రాష్ట్రాల వాహనాలు బయటకు వెళ్లకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడుతాయన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను కోరారు.

న్యాయమూర్తితో విచారణ చేయించాలి!

చిత్తూరుజిల్లాకు కండలేరు నీటిని తరలింపుకు 7390 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని విడుదల చేసి దుర్వినియోగం చేయడంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని సిపిఎం పార్టీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేశాయి. కండలేరు డెడ్ స్టోరేజి నుంచి చిత్తూరు జిల్లాకు తాగునీరు, పరిశ్రమలకు 6.61 టిఎంసీల నీటిని తరలించేందుకు జిఓ.నెం. 14ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఆఘమేఘాల మీద ఈ పథ కానికి రూ.7390 కోట్ల రూపాయలు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఇంజనీర్ల సలహా లేకుండా, నెల్లూరుజిల్లా ప్రజల ఆమోదం లేకుండా ఈ జిఓను ఇవ్వడం అన్యాయమని తక్షణం దీన్ని రద్దు చేయాలన్నారు.

25 కళా సంఘాల వార్షికోత్సవం!




నెల్లూరులోని 25 కళా సంఘాల ప్రథమ వార్షికోత్సవం టౌన్‌హాల్‌లో ఈ సంఘాల గౌరవాధ్య క్షుడు అమరావతి కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. 25 కళా సంఘాలు సాం స్కృతిక కార్యక్రమాలు, సినీ ఆర్కెస్ట్రా, క్లాసికల్, వెస్ట్రన్, ఫోక్ డ్యాన్సులు, మిమిక్రి, హాస్యవల్లరి, చిత్ర లేఖనం, హరికథలు, మ్యాజిక్, పౌరాణిక ఏకపాత్రాభినయాలతో అదర గొట్టేశారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 60వేల మంది కళాకారులుంటే ప్రభుత్వం ఆరువేల మందికి మాత్రమే పిం ఛన్లు అందజేస్తుందన్నారు. అందరు కళాకారులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. 25 కళా సంఘాలలోని ఎవరైనా కళాకారులకు ఆరోగ్యం బాగోలేకుంటే తమ సంఘం 10వేల రూపాయల ఆర్థిక సహాయం చేయాలని నిశ్చయించి నట్లు చెప్పారు. దీనికి వదాన్యులు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్ మంలో దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, సీనియర్ న్యాయవాది విజయ్ కుమార్‌రెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, వాస్తు రామచంద్ర, దోర్నాల హరి బాబు, కళాంజలి చక్రవర్తి, అందె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇట్టి బిట్టి స్కూల్‌లో బొమ్మల కొలువు



నెల్లూరు రాంజీ నగర్ నాల్గవ వీధిలోని ఇట్టి బిట్టి స్కూల్‌లో దసరా సందర్భంగా బొమ్మల కొలువు నిర్వహించారు. ఈ కొలువులో దశావతా రాలు, శ్రీకృష్ణలీలలు, వివిధ ఇతి వృత్తాలను తెలి యజేసే బొమ్మలను పెట్టారు. పిల్లలకు దసరా, బొమ్మల కొలువు విశిష్టతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు శశి రాజేంద్రన్, పిల్లల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతు లోకం

నాణ్యమైన విత్తనం కోసం పాటించాల్సిన మెళకువలు!

గతవారం తరువాయి భాగం

ప్రతి రెండు మీటర్లు, ఊడ్పుకి 20 సెంటీ మీటర్లు కాలిబాటలు వేయాలి. దీనివల్ల మొక్క లకు గాలి, వెలుతురు బాగా తగిలి, దోమ ఉధృతి తగ్గుతుంది.

పైరు నాటిన 40 రోజుల వరకు, పొలంలో కలుపు లేకుండా చూడాలి.

కలుపు నివారణకు నాటిన 3-5 రోజుల వ్యవధిలో ప్రిటలాక్లోర్ 500 మిల్లీలీటర్లు లేదా ఆక్సాడీయార్జిల్ 35 గ్రాములు ఎకరాకి 20 కిలోల ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లాలి. కలుపు మందు వేసేటప్పుడు పలుచగా నీరుండాలి. కలుపు మందు వేసిన తరువాత 2-3 రోజుల వరకు నాటిన చేలో నీటిని నిల గట్టాలి.

భూసార పరీక్షననుసరించి, సిఫార్సు మేరకు ఎరువులు వేయాలి. భాస్వరం గాని,

డాక్టర్ వై.సూర్యనారాయణ
ప్రధాన శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు.

భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు గాని పై పాటుగా వేయరాదు.

విత్తిన పంటకు మామూలు వాణిజ్య పంట వలె నీటి యాజమాన్యం పాటించాలి. కీలక దశలైన అంకురం ఏర్పడుట, పూత దశ, గింజపాలు పోసుకొని, గింజ గట్టిపడే దశల్లో నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. ఈ దశల్లో పైరు నాటి ఎద్దడికి గురైతే దిగుబడితో పాటు, విత్తన నాణ్యత లోపిస్తుంది.

కేళీల ఏరివేత

విత్తనోత్పత్తిలో ప్రధాన అంశం పంటలో కేళీలను తీయడం. ఈ కేళీల ఏరివేత ముఖ్యంగా 3 దశల్లో చేపట్టాలి. అవి ఏమిటంటే.

1. పైరు దుబ్బు చేసే సమయం.
2. పూత దశ
3. గింజ గట్టిపడినప్పుడు (వరి కోతకు ముందు)

(కొరవ వచ్చే వారం)

J/Nellore/008/12-14
జమీన్‌రైతు
Regn.No. : RN 1156 / 57
16
1 నవంబర్ 2013
చుక్కాని





Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Office: 2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com